

విద్యుద్దీప వెలుగుల్లో రంగడి ఆలయ గోపురం

ఉత్సవ శోభ

నగరంలోని తల్పగిరి రంగనాథుడి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 31వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలలో రోజుకో వాహనంపై స్వామివారు దర్శనం ఇవ్వనున్నారు. కాగా, ఉత్సవాలు సందర్భంగా రంగడి ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.

\- నెల్లూరు



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం) : 6.23
సహరి (గురువారం) : 4.53

23న నారా భువనేశ్వరి రాక

వెంకటాచలం, మార్చి 19: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఈ నెల 23వ తేదీన వెంకటాచలం మండలానికి రానున్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనస్తాపానికి గురై మండలంలోని కురిచెర్లపాడుకి చెందిన సుబ్బానాయుడు, పుంజులూరుపాడుకు చెందిన ఆర్ని నారాయణరెడ్డి గుండె పోటుతో మృతి చెందారు. ఈ క్రమంలో మృతుల కుటుంబాలకు ఇటీవల టీడీపీ తరఫున రూ.3 లక్షల చొప్పున చెక్కులను ఆ పార్టీ నేత సోమిరెడ్డి అందజేశారు. ఈ నేపథ్యంలో 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా శనివారం మధ్యాహ్నం 12.05 గంటలకు కురిచెర్లపాడుకి, 1.05 గంటలకు పుంజులూరుపాడుకు నారా భువనేశ్వరి చేరుకొని ఆ రెండు కుటుంబాలను పరామర్శించనున్నారని ఆ పార్టీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

పోరుకు సన్నద్ధం

ముమ్మరంగా అభ్యర్థుల ప్రచారం


గెలుపుపై ఎవరి అంచనాలు వారివే!

వ్యూహ, ప్రతివ్యూహాలతో ప్రజల ముందుకు..

సార్వత్రిక సమర భేరి మోగింది. ఎవరు..? ఎక్కడెక్కడ బరిలో నిలిస్తున్నారో తేలిపోయింది. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు ఉండగా అధికార వైసీపీ, టీడీపీ-బీజేపీ-జనసేన పార్టీలు ఉమ్మడిగా అభ్యర్థులను ఖరారు చేసి బరిలో నిలిపాయి. వ్యూహ, ప్రతివ్యూహాలతో ఓట్ల వేట కోసం అభ్యర్థులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గల్లో గత చరిత్రను అంచనావేస్తూ అభ్యర్థులతోపాటు ప్రధాన పార్టీల నాయకులు ముందుకు కదులుతున్నారు. పోలింగ్‌కు ఇంకా 54 రోజులు ఉన్నా విజయం కోసం ఉదయం, సాయంత్రం భేటీలు, సమావేశాలు, పగలు ప్రచారాలతో బిజీబిజీగా గడుపుతున్నారు.

\- ఆంధ్రజ్యోతి బృందం





'గిరి'ని సొంతం చేసుకునేదెవరు?

జిల్లాలో రాజకీయంగా ప్రత్యేక స్థానాన్ని ఏర్పర్చుకున్న ఉదయగిరి నియోజకవర్గంలో అనేక విశేషాలు ఉన్నాయి. కాంగ్రెస్ అభ్యర్థులు ఏడుసార్లు, టీడీపీ మూడుసార్లు, వైసీపీ రెండుసార్లు, జనతా పార్టీ, బీజేపీ, కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ ఒక్కోసారి, స్వతంత్ర అభ్యర్థి ఒకసారి గెలుపొందారు. 1952లో కిసాన్ మజ్దూర్ పార్టీ అభ్యర్థి కోవి రామయ్యచౌదరి, 1955, కాంగ్రెస్ అభ్యర్థి షేక్ మౌలాసాహెబ్, 1962లో పులి వెంకటరెడ్డి కాంగ్రెస్ తరఫున, 1967లో స్వతంత్ర అభ్యర్థి ధనెంకుల నరసింహం, 1972లో కాంగ్రెస్ అభ్యర్థి పొన్నెబోయిన చెంచురామయ్య, 1978, 1983లలో బీజేపీ అభ్యర్థి ముప్పవరపు వెంకయ్యనాయుడు గెలిచారు. 1985లో కాంగ్రెస్ తరఫున మేకపాటి రాజమోహన్‌రెడ్డి, 1989లో కాంగ్రెస్ అభ్యర్థి మాదాల జానకిరామ్, 1994లో స్వతంత్ర అభ్యర్థిగా 1999లో టీడీపీ అభ్యర్థిగా కంభం విజయరామిరెడ్డి గెలుపొందారు. 2004, 2009లలో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2012 (ఉప ఎన్నిక), 2019లో వైసీపీ తరఫున మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపొందారు. 2014లో టీడీపీ అభ్యర్థి బొల్లినేని వెంకటరామారావు విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ తరఫున కాకర్ల సురేష్, వైసీపీ నుంచి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బరిలో నిలుస్తున్నారు. రాజకీయ సంగ్రామంలో వీరిద్దరూ తొలిసారిగా బరిలో నిలుస్తుండటం గమనార్హం.

\- ఉదయగిరి

ప్రతిష్టాత్మకం.. నెల్లూరు రూరల్

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఏర్పడింది. నెల్లూరు, సర్వేపల్లి, రాపూరు నియోజకవర్గాల్లోని ప్రాంతాలను కలుపుకొని ఈ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. నెల్లూరు నగరంతోపాటు రూరల్ మండలంలోని పంచాయతీల్లోనూ ఈ నియోజకవర్గం విస్తరించి ఉంది. ఉద్యోగులు, వ్యాపారులు, కూలీలు, రైతులు ఎక్కువగా ఈ నియోజకవర్గంలో ఉన్నారు. 2009లో తొలిసారి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఆనం వివేకానందరెడ్డి విజయం సాధించా రు. ఆ తర్వాత 2014, 2019లలో వైసీపీ తరఫున కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విజయం సాధించారు. జిల్లా నలుమూలల నుంచి అనేక మంది నెల్లూరుకు వచ్చి రూరల్ నియోజకవర్గ పరిధిలో స్థిరపడ్డారు. దీంతో ఈ నియోజకవర్గంలో రాజకీయ చైతన్యం ఎక్కువగా కనిపిస్తుంటుంది. ప్రస్తుతం రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన శ్రీధర్‌రెడ్డి ఇప్పుడు టీడీపీ తరఫున పోటీ చేస్తుండగా, గతంలో నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి వైసీపీ నుంచి పోటీకి దిగుతున్నారు. ఈ ఇద్దరు ఉద్దండుల మధ్య ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది.

\- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

కాంగ్రెస్ కంచుకోట ఎవరిదో!

కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా పేరొందిన కందుకూరులో పార్టీలకన్నా వ్యక్తులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి గెలిపించిన చరిత్ర ఇక్కడి ఓటర్లది. 1955లో జరిగిన మొట్టమొదటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన దివి కొండయ్య చౌదరి సీపీఐ అభ్యర్థి రావిపాటి వెంకయ్యపై గెలుపొందారు. 1962, 1967లలోలో కాంగ్రెస్ అభ్యర్థిగా నలమోతు చెంచురామానాయుడు గెలుపొందారు. 1972లో స్వతంత్ర్య అభ్యర్థి మానుగుంట ఆదినారాయణ రెడ్డి విజయం సాధించారు. 1978లో కాంగ్రెస్ అభ్యర్థి దివి కొండయ్య గెలుపొందగా, 1983లో స్వతంత్ర అభ్యర్థి మానుగుంట ఆదినారాయణరెడ్డి విజేతగా నిలిచారు. 1985లో కాంగ్రెస్ అభ్యర్థి ఆదినారాయణ రెడ్డి, 1989లో ఆదినారాయణరెడ్డి వారసుడు మానుగుంట మహీధరరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. 1994, 1999లలో టీడీపీ అభ్యర్థి దివి శివరాం గెలుపొందారు. 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మహీధరరెడ్డి విజేతగా నిలిచారు. 2014లో వైసీపీ అభ్యర్థి పోతుల రామారావు, 2019 ఎన్నికల్లో వైసీపీ తరఫున మానుగుంట మహీధరరెడ్డి విజయం సాధించారు. ఇలా ఈ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థులు రెండు సార్లు, స్వతంత్రులు రెండుసార్లు, వైసీపీ అభ్యర్థులు రెండుసార్లు గెలుపొందారు. అయితే, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు మాత్రం ఎనిమిదిసార్లు విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, టీడీపీ అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావు బరిలో ఉన్నారు. ఏడు దశాబ్దాల రాజకీయ చరిత్రకు ఫుల్‌స్టాప్ పడిందా అన్నట్లుగా మొట్టమొదటిసారిగా కొత్త అభ్యర్థులను ఇరుపార్టీలు బరిలో దించి ఎన్నికలకు వెళ్తున్నందున కందుకూరు చరిత్రలో ఈ ఎన్నికలకు ఓ ప్రాధాన్యత సంతరించుకుంది.

\- కందుకూరు

ఆత్మకూరులో నువ్వా.. నేనా!?

ఉద్దండ రాజకీయ నేతల నియోజకవర్గం ఆత్మకూరులో ఇప్పటివరకు 17 సార్లు ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ 9 సార్లు, వైసీపీ 3 సార్లు, టీడీపీ 2 సార్లు, స్వతంత్రులు 2 సార్లు, ఎస్‌డబ్ల్యుఏ అభ్యర్థి ఒక్కసారి విజ యం సాధించారు. 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో జి.సి.కొండయ్య స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. 1957లో జి.సి.కొండయ్యపై గెలుపొందిన బెజవాడ గోపాలరెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా కూడా పని చేశారు. బెజవాడ గోపాలరెడ్డి లోక్‌సభకు వెళ్లడంతో 1959లో జరిగిన ఉప ఎన్నికల్లో ఆనం సంజీవరెడ్డి గెలుపొందారు. 1962లో ఆనం సంజీవరెడ్డి, 1967లో రామచంద్రారెడ్డి విజయం సాధించారు. 1972లో జనతా పార్టీ నుంచి కంచర్ల శ్రీహరినాయుడు, 1978లో కాంగ్రెస్ నుంచి డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి, 1983లో టీడీపీ అభ్యర్థి ఆనం వెంకటరెడ్డి, 1985, 1989లలో కాంగ్రెస్ అభ్యర్థిగా సుందరరామిరెడ్డి గెలుపొందారు. 1994లో టీడీపీ నుంచి కొమ్మి లక్ష్మయ్య నాయుడు, 1999లో కాంగ్రెస్ అభ్యర్థి బొల్లినేని క్రిష్ణయ్య విజయం సాధించారు. 2004లో టీడీపీ అభ్యర్థి కొమ్మి లక్ష్మయ్యనాయుడు, 2009లో కాంగ్రెస్ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, 2014, 2019లో వైసీపీ అభ్యర్థి మేకపాటి గౌతమ్‌రెడ్డి విజయం సాధించారు. గౌతమ్‌రెడ్డి మరణం తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో (2022) ఆయన సోదరుడు మేకపాటి విక్రమరెడ్డి విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా మేకపాటి విక్రమ్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తలపడుతున్నారు. ఆది నుంచి కొత్తకు ప్రాధాన్యమిస్తూ కొన్ని సమయాల్లో వర్గ రాజకీయందే పైచేయిగా ఉంటున్న ఆత్మకూరు లో ఈదఫా అర్థ, అంగబలం కలిగిన సమ ఉజ్జీలు రంగంలోకి దిగి విజయం సాధించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

నగరంలో విద్యావంతులు ఎటువైపు?

ఇప్పుడు నెల్లూరు సిటీగా ఉన్న అసెంబ్లీ నియోజకర్గం 2009కు ముందు నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గంగా ఉండేది. నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఏర్పడ్డాక నెల్లూరును నెల్లూరు సిటీ అసెంబ్లీ సీటుగా పరిగణిస్తున్నారు. ఈ నియోజకవర్గం 1952లో ప్రారంభమైంది. 1952 నుంచి 1983 వరకు నెల్లూరులో కాంగ్రెస్ హవా కొనసాగింది. అప్పట్లో కాంగ్రెస్‌కు పోటీగా గట్టి రాజకీయ పార్టీలు లేకపోవడంతో స్వతంత్ర అభ్యర్థులే పోటీ ఇచ్చేవారు. ఆ సమయంలో ఆనం చెంచు సుబ్బారెడ్డి, ఆనం వెంకటరెడ్డి వంటి ఉద్దండులు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1983లో టీడీపీ ఆవిర్భవం నుంచి నెల్లూరులో రాజకీయ ముఖ చిత్రం మారిపోయింది. 1983లో టీడీపీ తరఫున ఆనం రామనారాయణరెడ్డి గెలుపొందారు. 1985లో కాంగ్రెస్ పార్టీ, 1989లో స్వతంత్ర అభ్యర్థి జక్కా కోదండరామి రెడ్డి విజయం సాధించారు. 1994లో తాళ్లపాక రమేష్‌రెడ్డి టీడీపీ తరఫున గెలుపొంది ఎన్టీఆర్ మంత్రివర్గంలో పనిచేశారు. 1999, 2004లలో కాంగ్రెస్ అభ్యర్థి ఆనం వివేకానందరెడ్డి గెలుపొందారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో నెల్లూరు సిటీగా రూపాంతరం చెందిన నియోజకవర్గంలో ప్రజారాజ్యం పార్టీ నుంచి ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి గెలుపొందారు. 2014, 2019లలో వైసీపీ నుంచి పోలుబోయిన అనీల్‌కుమార్ యాదవ్ గెలుపొందారు. ఆయన జగన్మోహన్‌రెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు. ఇలా 1983 తర్వాత రెండు సార్లు టీడీపీ, మూడు సార్లు కాంగ్రెస్, రెండు సార్లు వైసీపీ, ఒకసారి పీఆర్పీలు విజయం సాధించాయి. విద్యావంతులు ఎక్కువగా ఉన్న నియోజకవర్గం కావడంతో ఏ పార్టీకి కూడా నెల్లూరు సిటీ కంచుకోటగా మారలేదు. ప్రస్తుతం టీడీపీ నుంచి పొంగూరు నారాయణ, వైసీపీ నుంచి ఎండీ ఖలీల్ అహ్మద్‌లు పోటీ పడుతున్నారు.

\- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)



కనకపట్నంలో పైచేయి ఎవరిదో!

కనకపట్నంగా పేరొందిన కావలిలో ఈసారి పైచేయి ఎవరు సాధిస్తారోనని అన్ని వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. 1952లో ఏర్పడిన ఈ నియోజకవర్గానికి 15 సార్లు ఎన్నికలు జరగ్గా 6 పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధించారు. 1952లో తొలి శాసన సభ్యుడిగా ప్రాజాపార్టీకి చెందిన బత్తిన రామకృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. అప్పటి నుంచి టీడీపీ ఆవిర్భావం వరకు 6 సార్లు ఎన్నికలు జరగ్గా రెండుసార్లు ప్రజాపార్టీ, మరో రెండుసార్లు కాంగ్రెస్, రెండు పర్యాయాలు స్వతంత్రులు విజయం సాధించారు. టీడీపీ ఆవిర్భావం 4 సార్లు కాంగ్రెస్, 3 సార్లు టీడీపీ, రెండుసార్లు వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు. కాంగ్రెస్ నుంచి కలికి యానాదిరెడ్డి 1985 నుంచి 1994 వరకు వరుసగా గెలిచి ఆయన మంత్రిగా కూడా పనిచేశారు. 2009లో జరిగిన నియోజకవర్గం పునర్విభజనలో కావలిలో ఉన్న జలదంకి, కలిగిరి, కొండాపురం మండలాలు ఉదయగిరి నియోజకవర్గంలోకి వెళ్లాయి, అల్లూరు నియోజక వర్గంలో ఉన్న అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాలు కావలిలో చేరాయి. పునర్విభజన అనంతరం 2009లో టీడీపీ అభ్యర్థిగా బీద మస్తాన్‌రావు, 2014, 2019లలో వైసీపీ అభ్యర్థిగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికలలో హ్యాట్రిక్ విజయం కోసం వైసీపీ తరఫున రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బరిలో నిలిచారు. ఇక టీడీపీ అభ్యర్థిగా దగుబాటి వెంకట (కావ్య) క్రిష్ణారెడ్డి పోటీ చేస్తున్నారు. వీరిద్దరి మధ్య పోటీ రసవత్తరంగా మారుతోంది.

\- కావలి

అందరి దృష్టి కోవూరుపైనే

మద్యపాన నిషేధం, పొదుపు ఉద్యమాలు పురుడు పోసుకున్న కోవూరు నియోజకవర్గంలో ఈసారి గట్టి పోటీ నెలకొంది. ఐదు మండలాలు ఉన్న ఈ నియోజకవర్గంలో 2,61,182 మంది ఓటర్లు ఉన్నారు. కాంగ్రెస్ 7 సార్లు, టీడీపీ 5సార్లు, వైసీపీ 2 సార్లు, సీపీఐ ఒకసారి గెలుపొందింది. 1952లో తొలిసారిగా సీపీఐ అభ్యర్థి బసవారెడ్డి శంకరయ్య గెలుపొందారు. 1962 నుంచి 1989 వరకు కాంగ్రెస్ అభ్యర్థులు రేబాల దశరథరామిరెడ్డి, వి.వెంకురెడ్డి, పి. రామచంద్రారెడ్డి, పెళ్లకూరు రామచంద్రారెడ్డి, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి గెలుపొందారు. ఆ తరువాత రాజకీయ పరిణామాల నేపథ్యంలో నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి టీడీపీలో చేరి గెలుపొందారు. 1994, 1999లలో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి గెలుపొందారు. 2009లో టీడీపీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విజయం సాధించారు. 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గెలుపొందారు. 2014లో టీడీపీ అభ్యర్థి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, 2019లో వైసీపీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విజయం సాధించారు. నియోజవర్గంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా కనుమరుగైన నేపథ్యంలో టీడీపీ, వైసీపీల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ నుంచి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వైసీపీ నుంచి సిటింగ్ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బరిలో నిలిచారు. వీరిద్దరి మధ్య గట్టిపోటీ ఉండటంతో అందరి దృష్టి కోవూరుపైనే నిలిచింది.

\- విడవలూరు

సర్వేపల్లి తీర్పు ఎటు?

రాష్ట్రంలో అధికా రం ఏ పార్టీ చేజిక్కించుకుంటుందో ఆ పార్టీ అభ్యర్థులకే పట్టం గట్టడం సర్వే పల్లి నియోజకవర్గ ప్రజల విజ్ఞతకు నిదర్శనం. 1955లో తొలి ఎమ్మెల్యేగా కాంగ్రెస్‌కు చెందిన బెజవాడ గోపాల్ రెడ్డి ఎన్నికయ్యారు. 1956లో కాంగ్రెస్ అభ్యర్థి వంగల్లు కోదండరామిరెడ్డి, 1962లో స్వతంత్ర అభ్యర్థి వేమారెడ్డి వెంకు రెడ్డి, 1967లో సీపీఐ అభ్యర్థి స్వర్ణా వేమయ్య, 1972లో కాంగ్రె స్‌కు చెందిన మంగళగిరి నానాదాస్ ఎస్సీ కేటగిరీలో గెలు పొందారు. జనరల్ స్థానంగా ఆరంభమయ్యాక 1978, 1989 లో కాంగ్రెస్ అభ్యర్థి సీవీ శేషారెడ్డి, 1983లో టీడీపీ అభ్యర్థి పెంచలరెడ్డి చెన్నారెడ్డి, 1985లో ఈదూరు రామకృష్ణారెడ్డి, 1994, 1999లో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విజయం సాధించారు. 2004, 2009లలో కాంగ్రెస్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, 2014, 2019లలో వైసీపీ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సర్వేపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం వైసీపీ అభ్యర్థిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి, టీడీపీ తరఫున సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రచారం చేస్తున్న ఆ పార్టీ అధిష్టానం అభ్యర్థి పేరును ప్రకటించాల్సి ఉంది.

\- ముత్తుకూరు

ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



శ్రీవారి చిత్రపటంతో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

బిట్రగుంట: బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు మంగళవారం రాత్రి అంకురార్పణ జరిగింది. అంతకు ముందు శ్రీవారి చిత్రపటంతో వైభవంగా గిరిప్రదక్షిణ నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. ఉదయం సుప్రభాత, తోమాలసేవ, మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, మంగళ హారతులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ తూర్పు అలంకార మండపంలో స్వామి వారి చిత్రపటానికి ప్రత్యేక పూజల అనంతరం ఉత్తర ముఖద్వారం ద్వారా గోవిందనామస్మరణలతో గిరిప్రదక్షిణకు బయలుదేరారు. గోమాతలు, మేళతాలు, మంగళ వాయిద్యాల నడుమ, కోలాటం, నృత్యాలు, కావలికి చెందిన చిన్నారుల స్వామి, అమ్మవార్ల వేషధారణ ఎంతగానో ఆకట్టుకున్నాయి. దేవాదాయశాఖ సహాయక కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, చెన్నమ్మ దంపతులు కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఈవో రాధాకృష్ణ, పాలక మండలి చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో కావలి ఆర్డీవో శీనానాయక్, తహసీల్దారు వెంకటరత్నం, ఉభయకర్తలు పాల్గొన్నారు.

నేడు ధ్వజారోహణం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తిరుమంజనం, సాయంత్రం ధ్వజారోహణం, కొడిముద్దల పంపిణీ, రాత్రి శేషవాహన సేవ, మహావిష్ణు అవతారంలో స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాలు జరగనున్నాయి. సంతానం లేని దంపతులు సంతాన గోపాలకృష్ణుడిని వేడుకొని ఉపవాస దీక్షతో ప్రసన్నుడి ప్రసాదమైన కొడిముద్దను స్వీకరించితే సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

రూ.లక్ష దాటితే నివేదిక ఇవ్వాలి : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), మార్చి 19 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రూ.లక్ష, ఆపైన నగదు లావాదేవీలపై బ్యాంకు అధికారులు నివేదిక ఇవ్వాలని కలెక్టర్ హరినారాయణన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో రాజకీయపార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేసిన నాటి నుంచి తరచుగా వారి ఖాతాలను పరిశీలించాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీల అభ్యర్థులకు కొత్త బ్యాంకు ఖాతాలను ప్రారంభించాలన్నారు. అలాగే రూ.10లక్షలకుపైగా బ్యాంకుల్లో జరిగిన లావాదేవీలపై జిల్లా ఎన్నికల అధికారికి నివేదికలు ఇవ్వాలన్నారు. బ్యాంకుల నుంచి ఏటీఎంలకు రవాణా చేసే నగదు వాహనాలకు క్యూఆర్ కోడ్ ఇవ్వాలని సూచించారు. అనుమానాస్పద లావాదేవీలపై బ్యాంకు అధికారులు ప్రతిరోజూ నివేదిక సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, ఎన్నికల ఖర్చు మానిటరింగ్ నోడల్ అధికారి విద్యాసాగర్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

● ప్రచారంలో పాల్గొంటే చర్యలు

రాజకీయ పార్టీల తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొనే వలంటీర్లు, ప్రభుత్వంలో పనిచేసే వారిపై ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. అలా ఎన్నికల ప్రచారంలో పాల్గొనే వారిపై అవసరమైతే కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

టీడీపీ జాతీయ అధికార ప్రతినిధిగా దినేష్



నెల్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా పోలంరెడ్డి దినేష్‌రెడ్డిని నియ మిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. పార్టీ అధినేత నారా చంద్ర బాబునాయుడు ఆదేశాల ప్రకారం ఈ నియామకం చేసినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

● కోడ్ ఉల్లంఘన



స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని వైసీపీ నాయకులు వైసీపీ పార్టీ కార్యాలయంగా మార్చారు. వైసీపీ నాయకుడు, ఎమ్మెల్యే అనుచరుడుగా ఉన్న స్థానిక ఎంపీపీ తనయుడు మరీ బరితెగించి ప్రభుత్వ కార్యాలయాన్ని పార్టీ కార్యాలయంగా మార్చేశాడు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా మంగళవారం పార్టీ సోషల్ మీడియా కో కన్వీనర్ ప్రసాద్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈయన వలంటీరు కూడా. ఈ తతంగమంతా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రభుత్వం చర్య లు తీసుకుంటుందని ప్రసాద్ వెంటనే వలంటీరు పోస్టుకు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. అయితే తాను దాన్ని ఇంకా ఆమోదించలేదన్నారు. కలెక్టర్ స్పందించి వలంటీర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు.

- సంగం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

● త్రుటిలో తప్పిన పెనుప్రమాదం



ప్రమాదానికి గురైన కారును పక్కకు తరలిస్తున్న హైవే సిబ్బంది

కావలి రూరల్, మార్చి 19: కావలి మండలం గౌరవరం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. అయితే త్రుటిలో పెనుప్రమాదం తప్పి ప్రాణాలతో బయటపడ్డారు. బాధితుల కథనం మేరకు.. బాపట్ల జిల్లా చీరాలకు చెందిన ఆళ్లపాటి వెంకట సుధాకర్ అనారోగ్యంతో ఉన్న తన బావమర్ధి భార్యను తీసుకుని వైద్యం కోసం ఒంగోలు నుంచి కుటుంబ సభ్యులతో కలసి ఇన్నోవా కారులో చెన్నైకి బయలుదేరారు. మార్గమధ్యంలో గౌరవరం దాబా హోటళ్ల వద్ద ముందు వెళ్తున్న లారీ షడన్‌గా ఆగడంతో వెనుకనే వస్తున్న ఇన్నోవా కారు ఆ లారీని వెనుక వైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ఎయిర్ బ్యాగ్ ఓపెన్‌కావడంతో వెంకట సుధాకర్‌తో పాటు మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. కారులో ఉన్న మిగిలిన నలుగురుకి ఎలాంటి గాయాలు కాలేదు. హైవే మొబైల్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన వాహనాలను పక్కన పెట్టించి స్వలంగా గాయపడిన వారిని మరో వాహనంలో చెన్నైకు పంపించారు.

హైస్కూల్ పక్కనే క్షుద్రపూజలు

● భయంతో పరీక్ష రాసిన విద్యార్థులు



తాటిపర్తిలో క్షుద్రపూజలు చేసినట్లుగా ఉన్న ఆనవాళ్లు

పొదలకూరు, మార్చి 19: మండలంలోని తాటిపర్తిలో మంగళవారం క్షుద్రపూజలు కలకలం రేపాయి. గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో పొలాలకు వెళ్లే మార్గంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు కనిపించాయి. ఎవరు... ఎందుకు చేశారో అర్థం కాక విద్యార్థులు, రైతులు భయాందోళనకు గురయ్యారు. టెన్త్ పరీక్షల వేళ పాఠశాల సమీపంలోనే ఇదేమిటని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. పైగా క్షుద్రపూజల కోసం వేసిన ముగ్గుపై ప్లాస్టిక్ కుర్చీ ఉంచారు. అక్కడే టెంకాయకొట్టి, పసుపు,కుంకుమలు చల్లారు. దీంతో విద్యార్థులు భయంభయంగా పరీక్షలు రాశారు.

కోవూరులో వ్యక్తి దారుణహత్య

● మృతుడి భార్యను విచారిస్తున్న పోలీసులు



అయ్యప్ప మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

విడవలూరు, (కోవూరు) మార్చి 19: కోవూరు మండలం బండా రుమాన్యంలో మంగళ వారం ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. కట్టుకున్న భార్యే చంపి ఉంటుందని కుటుంబ సభ్యులు పోలీ సులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు, కోవూరు మండలం పెద్ద పడుగుపాడు పంచాయతీ బండారు మాన్యానికి చెందిన పాకనాటి అయ్యప్ప (45) ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య వివాదాలు నడుస్తున్నాయి. అయ్యప్పకు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని భార్య నిత్యం గొడవపడేది. ఈ క్రమంలో మంగళవారం ఇంటికి వచ్చిన అయ్యప్ప దారుణహత్యకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రంగనాథ్‌గౌడ్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతుడి భార్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు.

మద్యం మత్తులో కాలువలో పడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ నారాయణ

నెల్లూరు(క్రైం), మార్చి 19: మద్యం మత్తులో ఓ వ్యక్తి కాలువలో పడి మృతి చెందాడు. నెల్లూరులోని ఉమ్మారెడ్డి గుంటలో మల్లికార్జున (52), సుజాత దంపతులు నివసిస్తున్నారు. వారికి వెంకట సాయిగిరి, నాగేంద్ర సంతానం. పిల్లల చిన్నతనం లోనే సుజాత మృతి చెందింది. అప్పటి నుంచి పిల్లల బాధ్యత మల్లికార్జున తీసుకున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై పిల్లలను పట్టించుకోవడం మానేశాడు. మంగళవారం ఉమ్మారెడ్డి గుంటలోని రవీంద్రనగర్ నాల్గోవీధి ఎదురుగా గల మురికి కాలువలో పడి మృతి చెందాడు. స్థానికులు గమనించి మల్లికార్జున కుమారుడు వెంకటసాయి గిరికి సమాచారం అందించారు. ఆయన వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూటుగా మద్యం సేవించి ప్రమాదవశాత్తు కాలు వలో పడి మృతి చెంది ఉంటాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), మార్చి 19: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని సంతపేట కటారి పాళేనికి చెందిన చిన్న(35), నవాబుపేట కుసుమ దళితవాడకు చెందిన భవానీ ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. వివాహం అనంతరం చిన్న, భార్యతో కలిసి కుసుమ దళితవాడలోనే నివాసం ఉంటున్నాడు. ఇటీవల దంపతుల మధ్య మనస్పర్ధలు రావడంతో తరచూ గొడవ పడుతున్నారు. ఆరురోజుల కిందట భవానీ భర్తతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో మనస్థాపానికి గురైన చిన్నా సోమవారం రాత్రి ఇంట్లోని ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన అత్త కామాక్షి స్థానికుల సహకారంతో చిన్నాను నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. కామాక్షి ఫిర్యాదుతో మంగళవారం నవాబుపేట పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	118
లేయర్ లైవ్	73
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234
లేయర్	125

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6251
వెండి కిలో ధర	రూ. 76,100
వెండి ఒక గ్రాము	రూ. 78.10


అడుగంటుతున్న జలనిధి

● 'సోమశిల'లో 12.044 టీఎంసీల నీరు
● అడుగంటుతున్న భూగర్భజలాలు
● పంటల సాగుపై రైతన్నల్లో ఆందోళన



సోమశిలలో తగ్గిన నీటి నిల్వ

అనంతసాగరం, మార్చి 19: జిల్లా జలనిధి సోమశిల జలాశయంలో నీటినిల్వ తగ్గి కళావిహీనంగా మారుతోంది. గతానికి భిన్నంగా నీటిమట్టం అడుగంటుతుండగా జిల్లా రైతాంగంలో ఆందోళన మొదలైంది. సోమశిల జలాశయంలో పుష్కలంగా నీరు ఉంటే అనంతసాగరం, మర్రిపాడు, కలువాయి, చేజర్ల మండలాల్లో భూగర్భ జలాలకు ఢోకా ఉండదు. అయితే ఈసారి ప్రాజెక్టు నీటినిల్వ డెడ్‌స్టోరేజ్‌కు పడిపోతుండడంతో రానున్న మాసం నుంచి నీటి ఇబ్బందులు నెలకొనే ప్రమాదం పొంచి ఉంది. జలాశయం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గతేడాది ఇదే సమయానికి 20 టీఎంసీల నీరు ఉండడంతో నీటికష్టాలను అధిగమించడం జరిగింది. ఈసారి మాత్రం నీటినిల్వ గణనీయంగా పడిపోతుండటంతోపాటు ఎండతీవ్రత పెరుగుతున్న పరిస్థితితో నీటి అవసరాలు పెరిగే సూచనలు ఉన్నాయి. ఈ క్రమంలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నీటి లభ్యత లేక ఇబ్బంది పడే పరిస్థితి కనిపిస్తోంది. 2023లో సోమశిల క్యాచ్‌మెంట్ ఏరియాలో ఆశించిన వర్షపాతం నమోదుకాక పోవడంతో పాటు తెలుగు గంగకు రావాల్సిన కృష్ణా జలాలు తెప్పించడంలో ప్రభుత్వం చొరవ చూపక పోవడం వల్ల ఈసారి నీటి ఇబ్బందులు మొదలైనట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం సోమశిలలో 12 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇందులో రోజువారీగా డెల్టాకు 1600, నాన్‌డెల్టాకు 960 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. మొదటి పంట అవసరాల కోసం ఈనెల ఆఖరు వరకు నీరు ఇవ్వాల్సి ఉండగా ఉన్న నీటి మట్టంలో ఐదు టీఎంసీలు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. ఆతర్వాత ప్రాజెక్టులో మిగిలిది 7 టీఎంసీలు కాగా ఈ ఏడాది వర్షాకాలం వరకు ఉన్న జలాలతో అవసరాలు తీరుతాయా అనే సందేహం వ్యక్తమవుతోంది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టక పోవడంతో పాటు సార్వత్రిక ఎన్నికల హడావుడిలో యంత్రాంగం నిమగ్నమైన పరిస్థితితో రానున్న నీటి ఇబ్బందులు తలచుకొని జిల్లావాసులు ఆందోళన చెందుతున్నారు.



బొమ్మవరంలో సాగులో ఉన్నా మిర్చిపంట

● పంటల పరిస్థితి అగమ్యగోచరం

ఎండల తీవ్రత పెరుగుతుండగా నీటిలభ్యత తగ్గి బోర్ల కింద సాగు చేసిన పంటల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అనంతసాగరం, మర్రిపాడు, దుత్తలూరు, వరికుంటపాడు, సీతారాంపురం తదితర మండలాల్లో సాగులో ఉన్న మిరప, పత్తి, బత్తాయి, పసుపు, బొప్పాయి పంటలకు సరిగా నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఈఏడాది సెప్టెంబరు వరకు వర్షాలు కురిసే అవకాశం లేకపోవడంతో పరిస్థితి దారుణంగా ఉండే ప్రమాదం ఉంది.

నిర్భయంగా ఓటు వేయాలి

● ప్రశాంత ఎన్నికలే లక్ష్యం
● ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి



ప్రతిభ కనబరిచిన అధికారులను అభినందిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైం), మార్చి 19: ప్రజలందరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకు నేలా భరోసా కల్పించాలని ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావ రణంలో నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాలను సందర్శించి రాజకీయ నాయకులు, గ్రామపెద్దలు, ప్రజలతో మమేకమవుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అవగాహన కల్పించాలన్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌, గత ఎన్నికల్లో కేసుల్లో ఉన్నవారందరిని బైండోవర్ చేయాలన్నారు. లైసెన్స్డ్ ఆయుధాలను డిపాజిట్ చేయాలని ఆదేశించారు. నాన్ బెయిలబుల్ వారెంట్లను ఎగ్జి క్యూట్ చేయాలని, మద్యం, నగదు, ఇతర వస్తువుల అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలు చేయాలని ఎస్పీ సూచించారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం దర్యాప్తులో ప్రతిభ కనపరిచి, కేసుల పెండెన్సీని తగ్గించిన పోలీసు అధికా రులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు ఈవీఎంలను సిద్ధం చేయండి : కలెక్టర్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మార్చి 19 : గోదాములలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం)లను పూర్తి స్థాయిలో పోలింగ్‌కు సిద్ధం చేయాలని కలెక్టర్ హరినారాయణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నెల్లూరు ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని గోదాముల్లో ఉన్న ఈవీఎంలను వివిధ పార్టీల నాయకులతో కలసి కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ సమయంలో ఎలాంటి సాంకేతిక లోపాలు రాకుండా తనిఖీ చేయాలని బెల్ ఇంజనీర్లకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో మలోల, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు
● అతివేగమే కారణం



పెంచలయ్య మృతదేహం

వెంకటాచలం, మార్చి 19: మండలంలోని అనికేపల్లి సమీపంలోని రామాపురం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు, అనికేపల్లికి చెందిన పీ పెంచలయ్య (45), వెంకటరమణయ్య వేర్వేరుగా మోటర్ బైక్‌లపై గొలగమూడి వైపు నుంచి అనికేపల్లికి పోటాపోటీగా వెళ్తున్నారు. అనికేపల్లి సమీపంలో ఉన్న మలుపు వద్దకు వచ్చేసరికి పెంచలయ్య నడుపుతున్న మోటర్ బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొంది. ఆ వెనుకనే మోటర్ బైక్‌పై వస్తున్న వెంకటరమణయ్య కూడా స్తంభానికి ఢీకొని పెంచలయ్య బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో పెంచలయ్యకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటరమణయ్య మాత్రం తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఆయన్ను చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ అంకమ్మరావు తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అయితే ప్రమాదానికి కారణం అతి వేగమేనని తెలిసింది. మృతుడు పెంచలయ్యకు భార్య వజ్రమ్మ, కొడుకు, కుమార్తె ఉన్నారు. పెంచలయ్య మృతి విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పెంచలయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నెల్లూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వీఆర్‌వో, వలంటీర్లపై విచారణ

చేజర్ల, మార్చి19: మండలంలోని పాడేరులో సోమవారం సాయంత్రం మేకపాటి విక్రమ్‌రెడ్డి చేపట్టిన విజయోభవ యాత్రలో గ్రామ వీఆర్‌వో కాల్వ లక్ష్మీనరసింహ ప్రసాద్, వలంటీర్లు పాల్గొన్నారు. ఈ సంఘటనపై మంగళవారం తహసీల్దార్ కే.గోపికృష్ణ, ఎంపీడీఓ కరీముల్లా గ్రామంలో విచారణ చేపట్టారు. వివరాలు సేకరించారు. తుది నివేదికను ఆత్మకూరు ఆర్డీవో పంపుతామని తహసీల్దార్ తెలిపారు.

ఉద్యోగుల తీరుపై ఆరా

వరికుంటపాడు, మార్చి 19: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన పలు శాఖలకు చెందిన ఉద్యోగుల తీరుపై ఉన్నతాధికారులు ఆరా తీశారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన అధికార దాసోహం కథనానికి స్పందించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు ఎంపీడీవో, తహసీల్దార్లు పెద్దిరెడ్డిపల్లి, తూర్పు కొండారెడ్డిపల్లి, నార్త్‌కొండాయపాళెం గ్రామాలకు చెందిన ఉపాధిహామీ పథకం క్షేత్రసహాయకులతో మాట్లాడారు. కాంచెరువు గ్రామానికి చెందిన ఎండీయూ వాహన ఆపరేటర్ల నుంచి సమగ్ర నివేదికలు సేకరించారు. వారి నుంచి లిఖిత పూర్వకంగా సేకరించిన నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు.

నెల్లూరులో తొలి వేటు

● వెంగళరావునగర్ వలంటీరు తొలగింపు
● పబ్లిక్‌హెల్త్ ఉద్యోగిపై చర్యలకు నివేదిక

నెల్లూరు(సిటీ), మార్చి 19 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిబంధనలు అతిక్రమించిన ఓ వలంటీరుపై వేటు పడింది. ఈ మేరకు నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంగళరావు నగర్‌లోని 2వ సచివాలయ పరిధిలో పని చేసే వలంటీరు జే శ్రీనివాసులు ఓ రాజకీయ పార్టీకి అనుకూలంగా పని చేస్తూ లబ్ధిదారుల వివరాలు అందచేయడం, ఇతర వలంటీర్లను కూడా లబ్ధిదారుల వివరాలు అందచేయాలని కోరుతూ సందేశాలు పంపుతున్నట్లు కమిషనర్‌కు ఫిర్యాదు అందింది. సమగ్ర విచారణ జరిపి ఆ వలంటీర్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా, కార్పొరేషన్ కార్యాలయంలోని ప్రజారోగ్య విభాగంలో పని చేస్తున్న ఓ వ్యక్తి ఈ నెల 17వ తేదీన వైసీపీ అభ్యర్థిని తీసుకెళ్లి చర్చిలో ప్రార్థనలు చేయిస్తున్నట్లు వీడియో వెలుగులోకి వచ్చింది. దీంతో సదరు వ్యక్తిపై చర్యలు తీసుకునేందుకు సమగ్ర వివరాలు అందచేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. అయితే, ఈ విషయం బయటకు రాకుండా సదరు వ్యక్తి పెద్దఎత్తున పైరవీలు నడుపుతున్నట్లు తెలిసింది.

నిర్మాణం ఆపాలని హైకోర్టు ఉత్తర్వులు

నెల్లూరు(సిటీ): నగరంలోని 6వ డివిజన్ పప్పుల వీధిలో మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద కార్పొరేషన్ స్థలంలో నిర్మాణాలు ఆపాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు స్థానికులు తెలిపారు. ఇక్కడి కార్పొరేషన్ స్థలంలో అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతుండటంతో తాము హైకో ర్టును ఆశ్ర యించి నట్లు పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వులను మున్సిపల్ అధికారులకు కూడా అంద చేశా మని వెల్లడించారు.

పదో తరగతి పరీక్షలకు 27,827 మంది హాజరు



పరీక్ష తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (విద్య), మార్చి 19 : జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం హిందీ పరీక్ష నిర్వహించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 176 కేంద్రాల్లో ఈ పరీక్షకు 28,770 మంది విద్యార్థులకుగాను 27,827 మంది హాజరయ్యారు. 943 మంది గైర్హాజరయ్యారు. కలెక్టర్ ఎం హరినారాయణన్ మూడు కేంద్రాలను, విద్యాశాఖ జేడీ, జిల్లా పరిశీలకుడు మువ్వా రామలింగం పది కేంద్రాలను, డీఈవో రామారావు నాలుగు సెంటర్లను, జిల్లా పరీక్షల విభాగం ఏడీ అసదుల్లాఖాన్ ఒక కేంద్రాన్ని, ఫ్లైయింగ్ స్క్వాడ్ 62 కేంద్రాలను పరిశీలించాయి. వసతులు సరిగా లేని ప్రాంతాల్లో వెంటనే వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు వారి సమస్యలను కంట్రోల్ రూమ్ నెంబరు 8341408109కు తెలియజేయాలని కోరారు.

ఓపెన్‌స్కూల్ పరీక్షలకు 1650 మంది...

జిల్లాలో జరుగుతున్న ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు మంగళవారం మొత్తం 1,650 మంది అభ్యాసకులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా పదో తరగతికి 11, ఇంటర్‌కు 19 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో జరిగిన పరీక్షలకు 1,751 మంది హాజరు కావాల్సి ఉండగా 1,648 మంది హాజరుకాగా 103 మంది గైర్హాజరయ్యారు. అధికారులు మొత్తం 10 పరీక్ష కేంద్రాలను పరిశీలించారని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అసదుల్లాఖాన్ తెలిపారు.

నేటి నుంచి జొన్న, మొక్కజొన్న సేకరణకు రిజిస్ట్రేషన్

● సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలి : జేసీ



మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

నెల్లూరు(హరనాథపురం), మార్చి 19 : జొన్న, మొక్క జొన్న పంట దిగుబ డుల సేకరణకు రిజి స్ట్రేషన్ ప్రక్రియను బుధవారం నుంచి ప్రారంభిస్తున్నామని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. మంగళవారం ఆయన చాంబర్‌లో కొనుగోలు కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ నిర్దేశిత నాణ్యతా ప్రమాణాల మేరకు జొన్నపంట ఒక క్వింటాకు రూ.3180, మొక్కజొన్న క్వింటాకు రూ.2090 కనీస మద్దతు ధర ప్రకటించినట్లు తెలిపారు. మార్కెట్ ధర కనీస మద్దతు ధర కన్నా తక్కువగా ఉంటే మార్క్‌ఫెడ్ ద్వారా జొన్న, మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఆయా పంటలు సాగుచేసే రైతులందరూ బుధవారం నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు సీఎం యాప్‌లోగానీ, రైతు భరోసా కేంద్రాలను సంప్రదించిగానీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మార్క్‌ఫెడ్ డీఎం పవన్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

నెల్లూరు(క్రైం), మార్చి 19: అనారోగ్యంతో బాధపడుతూ ఓ వృద్ధురాలు ఆత్మ హత్యకు యత్నించింది. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని ఉస్మాన్ సాహెబ్‌పేటలో విశ్రాంత ఉద్యోగి మురళీధర్, ఉమాదేవి దంపతులు నివసిస్తు న్నారు. ఉమాదేవి కొంత కాలంగా నిద్రలేమితో బాధపడుతోంది. మందులు వాడు తున్నా ప్రయోజనం లేకపోవడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. మంగళవారం ఇంట్లోని వంట గ్యాస్ ట్యూబ్‌ను కాల్చడంతో మంటలు వ్యాపించాయి. మంటల్లో చిక్కుకున్న ఉమా దేవికి తీవ్రగాయాల య్యాయి. గమనించిన భర్త మురళీధర్, భార్య చెల్లెలు మంజువాణి కలిసి ఉమా దేవిని అపోలో వైద్యశాలకు తీసుకెళ్లారు. మంజువాణి ఫిర్యాదుతో నవాబుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌నే పదేళ్లు కొనసాగించండి

● హైకోర్టులో వ్యాజ్యం దాఖలు

మనుబోలు, మార్చి 19: ఉమ్మడి రాజధానిగా హైద్రా బాద్‌నే మరో పదేళ్లపాటు పొడిగించాలని కోరుతూ అమరా వతిలోని హైకోర్టులో మంగళవారం మనుబోలు మండలం అక్కంపేట మాజీ సర్పంచు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాజ్యం దాఖలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్లుగా రాజధాని లేకపోవడం, నిధులు విడుదల, ఉమ్మడి ఆస్తుల విభజన పూర్తిగా జరగలేదని, అంతేగాక ఈ ఏడాది జూన్ 2నాటికి పదేళ్ల ఉమ్మడి రాజధాని కాలపరిమితి ముగియ నుండడంతో పునర్విభజన చట్టంలో పొందుపరిచిన పార్ట్-2, సెక్షన్5 ప్రకారం మరో పదేళ్లపాటు హైదరాబాద్‌నే ఉమ్మడి రాజధానిగా పొడిగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై బుధ వారం కోర్టులో వాదనలు జరగనున్నాయి.

పోలీసులకు 'ఉత్తమ' పతకాలు

నెల్లూరు (క్రైం), మార్చి 19 : విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బందికి ఈ ఏడాది ఉగాది పురస్కరించుకుని మంగళవారం రాష్ట్ర ప్రభు త్వం పతకాలను ప్రకటించింది. నెల్లూరు సీఐడీ డీఎస్పీ కె వేణుగోపాల్ ఉత్తమ సేవా పతకం, ఉదయగిరి సీఐ వి గిరిబాబు, స్పెషల్‌బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ ఎ మల్లికార్జునరావు, దర్గామిట్ట హెడ్‌కానిస్టేబుల్ జి భాస్కర్ రావు, చిన్నబజారు హెడ్‌కానిస్టేబుల్ బీవీ వినోద్‌కుమార్, కావలి ఫైర్‌మన్ సిహెచ్ నారాయణలకు సేవాపతకాలకు ఎంపికయ్యారు. ఆగష్టు 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఈ పతకాలను వారు అందుకోనున్నారు.

గోపురం పైనుంచి పడి కార్మికుడి మృతి

కదిరి, మార్చి 19: శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోని దక్షిణ గోపురంపైన అలంకరణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడి కార్మికుడు మృతి చెందాడు. పట్టణ ఎస్ఐ బాబ్‌జాన్ తెలిపిన మేరకు, నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన జాషువా అలంకరణలు చేయడానికి టీమ్ సభ్యులతో కలిసి కదిరికి వచ్చారు. ఆలయంలోని దక్షిణగోపురంపై మంగళవారం అలంకరణ చేస్తుండగా.. ప్రమాదవశాత్తూ జారి కిందపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని తోటి కార్మికులు, ఆలయ సిబ్బంది హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలిస్తుండగా.. మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ శ్రీలత పరిశీలించారు.

పాలకులకు పట్టని కరువు

- ఎన్నికల వేళ కరువు ప్రాంతంగా ప్రకటన
- కోడ్ రావడంతో ప్రశ్నార్థకంగా పంట నష్ట పరిహారం
- సంతకు పశువుల తరలింపు
- దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో వలస బాటన ప్రజలు


వరికుంటపాడులో బీడుగా మారిన వ్యవసాయ భూములు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): 2023 -24లో రబీసీజన్‌ను కరువు కమ్మేసింది. వరుణుడు కరుణించలేదు. చెరువులకు నీరు చేరలేదు. బోరు బావులు అడుగంటాయి. అన్న దాతలు, కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకపోయారు. భరోసా ఇవ్వాల్సిన పాలకులు క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలు కళ్లారా చూడలేదు. ఎన్నికల సమయంలో రబీ సీజన్‌కు కరువు మండలంగా ప్రకటించారు. మరి పంట పరిహారం ఎవరిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

2,165 హెక్టార్లలో పడని విత్తు

మండలంలోని రబీ సీజన్‌లో 2,913 హెక్టార్లలో కేవలం 748 హెక్టార్లలో మాత్రమే రైతులు పంటలు సాగు చేశారు. 830మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 466.6 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది.

పశుగ్రాసమేది..

వ్యవసాయం తరువాత పాడిపైనే ఆధారపడి రైతులు జీవనం సాగిస్తుంటారు. మండలంలో 9,870 ఆవులు, గేదెలు, 30,081 గొర్రెలు, మేకలున్నాయి. వీటికి పశుగ్రాసం, తాగునీరు కరువై యజమానులు డెల్టా ప్రాంతానికి వలస వెళుతున్నాయి. వలస వెళ్లలేని యజమానులు ఇతర ప్రాంతాల నుంచి ఎకరా రూ.15 నుంచి రూ.20 వేలు ఖర్చు చేసి గడ్డిని తీసుకొచ్చి గేదెలు, ఆవుల ను కాపాడుకొంటున్నారు. డబ్బులేని రైతులు ఉపాధి చూపే పశువులు, ఎద్దులను సంతకు తరలించి అమ్ముకుంటున్నారు.

వరికుంటపాడు: కృష్ణంరాజుపల్లి, నల్లబో తులవారిపల్లి, అలివేలుమంగాపురం, సాతువారిపల్లి, తూర్పుపాళెం, కొండ్రాజుపల్లి, నార్త్‌కొండా యపాళెం, దక్కనూరు నుంచి ప్రజలు బెంగళూరు, హైదరాబాదు, చెన్నై, విజయవాడ, గుంటూరు, వైజాగ్, నెల్లూరు, ఒంగోలు, తెలంగాణ ప్రాంతాలకు కుటుంబ సమేతంగా తరలివెళ్లి వ్యాపారాలు, బేల్దారి, ఇతరత్రా పనులు చేసుకుంటూ కాలం వెళ్లబుస్తున్నారు. ఒకప్పుడు ఇంటిల్లి పాది జన సందడితో కళకళలాడే పల్లెలు ప్రాంతాలు నేడు జనసంచారం లేక మూగబోయాయి. సాగునీటికి నోచుకోని వ్యవసాయ భూములు నేడు కంపచెట్లతో నిండి అడవులను తలపిస్తున్నాయి. నార్త్‌కృష్ణంరాజుపల్లి పంచాయతీలో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. గ్రామంలో 450 కుటుంబాలుండగా 150 కుటుంబాలు గ్రామం వదిలి వలసవెళ్లాయి. 1200ఉండే జనాభా ప్రస్తుతం 500లోపే ఉంటున్నారు. అందులో వృద్ధులు, మహిళలే అధికంగా ఉండడం గమనార్హం. గ్రామానికి కూతవేటు దూరంలో గండిపాళెం జలాశయం ఉన్నా పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో సాగునీరు అందని ద్రాక్షగానే మారింది.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోండి

వరికుంటపాడు, మార్చి 19: ఆరోగ్య సురక్ష పథకం కింద అందిస్తున్న వైద్యసేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి తెలిపారు. ఈ సందర్భంగా నిపుణులైన వైద్యులతో రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మమ్మ సర్పంచ్ తాతపూడి విజయమ్మ, వైద్యులు ఆయేషా, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఉదయగిరి రూరల్, మార్చి 19: ఏపీవీవీపీ విభాగంలో పని చేస్తున్న ఉద్యోగులు మంగళవారం జిల్లా ల్యాబ్ టెక్నీషియన్‌ల సంఘం ఆధ్వర్యంలో నెల్లూరులోని కార్యాలయంలో డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను సీనియార్టిని బట్టి రెగ్యులర్ చేయడం, కాంట్రాక్టు ఉద్యోగులందరికీ గ్రాస్ పే వర్తింపచేయాలన్న డిమాండ్లతో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

రేపు పరిచయ కార్యక్రమం

ఉదయగిరి రూరల్, మార్చి 19: స్థానిక చెంచు రామయ్య అతిథిగృహంలో గురువారం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌తో పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని వెంకటరామారావు, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ పాల్గొంటారన్నారు. ఆయా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

జగన్‌ను ఇంటికి పంపేందుకు జనం సిద్ధం

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి


సమావేశంలో మాట్లాడుతున్న చెంచలబాబు

ఉదయగిరి రూరల్, మార్చి 19: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని రాష్ట్ర ప్రజలు శాశ్వతంగా ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ జోస్యం చెప్పారు. స్థానిక చెంచురామయ్య అతిథిగృహంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలయికను ప్రజలు స్వాగతిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ప్రజాగళంసభకు ప్రజల నుంచి ఊహించని స్పందన వచ్చిందన్నారు. ఈ పొత్తు రాష్ట్రాభివృద్ధికి ఎంతో అవసరమన్నారు. జగన్‌రెడ్డితో పొత్తుకు ప్రజలు, రాజకీయ పార్టీలు సిద్ధంగా లేరన్నారు. 2019లో ఒక్క అవకాశమని చెప్పి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. టీడీపీ అధిష్ఠానం నిర్ణయించిన ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2024లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులు మాబాషా, సందానీ, అరుణమ్మ, మేస్త్రీ వెంకటేశ్వర్లు, సురేష్, అంబటి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలుపై ఆరా


మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి కన్నమనాయుడు

సంగం, మార్చి 19: మండలంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి క్షేత్రస్థాయిలో ఎలా అమలవుతుందో అని మంగళవారం జడ్పీ సీఈఓ, ఎన్నికల ప్రవర్తన నియమావళి జిల్లా నోడల్ అధికారి కన్నమనాయుడు పరిశీలించారు. స్థానిక మండల పరిషత్, వెలుగు, ఎంఈవో కార్యాలయాలను తనిఖీ చేశారు. కార్యాలయం లోపల, బయట ఎక్కడైనా రాయకీయ నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు ఉన్నాయో అని ఆరా తీశారు. కోడ్ అమలులోకి రావడంతో ఎన్నికల ఆదేశాల మేరకు ఫ్లెక్సీలు కన్పించరాదన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీవో శేషగిరిరావు, ఎంఈవోలు జానికీరాం, మల్లయ్య ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై అవగాహన

ఉదయగిరి రూరల్, మార్చి 19: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఎన్నికల విధులకు వెళ్లే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై మంగళవారం జిల్లా నోడల్, కోఆర్డినేటింగ్ అధికారులు వెంకట్రావు, శ్రీనివాసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు నియమించినబడిన ఉద్యోగులకు ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఇస్తారని, ఎలాంటి తప్పిదాలు లేకుండా బ్యాలెట్ ఫారాలను పూర్తి చేసి తమ ఓటుహక్కు వినియోగించుకొనేలా చూడాలన్నారు. ప్రతి మండలం నుంచి డీటీ, సీనియర్ అసిస్టెంట్, ఆర్‌ఐలకు అవగాహన కల్పించామని, వారు అందుబాటులో ఉండి గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి బాక్సులో వేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్వో రాజారమేష్ ప్రేమ్‌కుమార్, ఏఆర్వో నెహ్రూబాబు పాల్గొన్నారు.

సచివాలయాలకు హైసెక్యూరిటీ పత్రాల పంపిణీ

ఉదయగిరి రూరల్, మార్చి 19: మండలంలోని అన్ని సచివాలయాలకు ప్రజలకు అవసరమైన వివిధరకాల ధ్రువపత్రాల జారీ చేసేందుకు హైక్యూరిటీ పత్రాలను సచివాలయాలకు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో ఈశ్వరమ్మ తెలిపారు. ఈ విషయంపై మంగళవారం ఆమె కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నిన్నమొన్నటి వరకు సచివాలయాల ద్వారా అందించే ధ్రువపత్రాలపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రం ఉండేదన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ధ్రువపత్రాలపై సీఎం చిత్రం లేకుండా ధ్రువపత్రాలు జారీ చేసేలా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వం అందించిందన్నారు. ఇకపై సచివాలయాల్లో ధ్రువపత్రాలను నూతన హైసెక్యూరిటీ పత్రాలపైనే ఇవ్వాలన్నారు.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం.. క్రీడాకారులకు శాపం


అసంపూర్తిగా ఉన్న ఇండోర్ స్టేడియం నిర్మాణం

ఉదయగిరి రూరల్, మార్చి 19: వైసీపీ ప్రభుత్వం ఆడుదాం..ఆంధ్రా కార్యక్రమాన్ని ఒక ప్రచార వేదికగా వాడుకుంది తప్ప క్రీడలను ప్రోత్సహిం చాలనుకుంటే శాశ్వత క్రీడా వేదికల నిర్మాణాలు చేపట్టలేదు. అందుకు ఉదా హరణే ఈ అసంపూర్తి ఇండోర్ స్టేడియం నిర్మాణం. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉదయగిరిలో రూ.2 కోట వ్యయంతో ఇండోర్ స్టేడియం పనులు ప్రారంభమయ్యాయి. శ్లాబ్ స్థాయికి నిర్మాణం జరిగింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దాని నిర్మాణాన్ని పూర్తిగా నిలిపివేసింది. ప్రస్తుతం ఆ అసంపూర్తి భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మరోవైపు 67-బీజీ జాతీయ రహదారి నిర్మాణంలో ఆ భవనాన్ని పూర్తిగా తొలగించనున్నారు.

ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలి

ఉదయగిరి రూరల్, మార్చి 19: మండలంలో ప్రతిఒక్కరూ ఎన్నికల కోడ్ అమలను పక్కాగా అమలు చేయాలని మండల మోడల్ కోడ్ ఆఫ్ కం డక్ట్ నోడల్ అధికారిణి దేవరకొండ ఈశ్వరమ్మ పేర్కొన్నారు. మంగళవారం ఆమె గండిపాళెం, వెంగళరావునగర్ గ్రామాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలును పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రచార శిలాఫలకాలను గుర్తించి వాటిని పూర్తిగా మూయించేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జున పాల్గొన్నారు.

పది పరీక్షలకు 27మంది గైర్హాజరు

అనంతసాగరం: రేవూరు, అనంతసాగరం, సోమశిల పరీక్ష కేంద్రాల నుంచి మంగళవారం హిందీ పరీక్షకు 27 మంది హాజరుకాలేదని అనంతసాగరం ఎంఈవో బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఇందులో 8మంది రెగ్యులర్, 19మంది సప్లమెంటరీ రాసే విద్యార్థులు ఉన్నట్లు చెప్పారు.

పోలీసుల కవాతు



ఏఎస్ పేట : మండల కేంద్రంతోపాటు అనుమసముద్రం గ్రామాల్లో మంగళవారం ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు, మిలటరీ సిబ్బంది కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు జరుగనుండటంతో ముందస్తుగా కవాతు నిర్వహించా మని ఎస్ఐ చెప్పారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ముందస్తు చర్యలు తీసు కుంటామన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

సోమశిలలో 11.823 టీఎంసీ నిల్వ

అనంతసాగరం: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా మంగళవారం నాటికి ప్రాజెక్టులో 11.823 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1500, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పీహెచ్‌సీలో కు.ని.కి మంగళం!

- నాలుగేళ్లుగా జరగని ఆపరేషన్లు
- డాక్టర్లు, సిబ్బంది, వసతులు ఫుల్
- లక్ష్యసాధన నిల్
- పట్టించుకోని ఉన్నతాధికారులు


వలేటివారిపాలెం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం

వలేటివారిపాలెం, మార్చి 19 : వలేటివారిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు మంగళం పాడారు. డాక్టర్లు, సిబ్బంది, వసతులు ఫుల్‌గా ఉన్నా లక్ష్య సాధనకు ఎలాంటి చర్యలు తీసు కుంటున్న దాఖలాలు లేవు. దీంతో గత నాలుగేళ్లుగా ఎలాంటి కుటుంబ ని యంత్రణ ఆపరేషన్లు జరగడంలేదు. అయినా సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. ఈ క్రమంలో బాలింతలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీసి వేల రూపాయలు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్థానిక పీహెచ్‌సీలో కార్పొరేట్ తరహాలో భవన వసతి ఉంది. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు అవసరమైన పరికరాలు ఉన్నాయి. ఆపరేషన్ గది ఉంది. అవసరమైన మందులు ఉన్నాయి. ముగ్గురు డాక్టర్లు ఉన్నారు. ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉన్నారు. ల్యాబ్‌టెక్నీషియన్, ఫార్మాసిస్ట్‌తో పాటు సరిపడ సిబ్బంది ఉన్నారు. అయినప్పటికీ కుటుంబ నియంత్రణ అపరేషన్లు చేసే వారే లేరు. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించడు అన్న సామెతగా ఉంది ఇక్కడి వైద్యులు, సిబ్బంది పనితీరు. ప్రభుత్వం అన్ని రకాల పరికరాలు, భవన వసతి, డాక్టర్లు, సిబ్బంది, మందులు, పరీక్షలు తదితర సదుపాయాలు కల్పిస్తున్నా వైద్యులు నిర్లక్ష్యంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఎందుకు చేయడం లేదో వారికే తెలియాలి. ఒకవేళ ఎవరైనా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు స్థానిక పీహెచ్‌సీకి వస్తే ఇక్కడ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసే డాక్టర్లు లేరు.. పరికరాలు, మందులు లేవు.. పరీక్షలు చేసేందుకు అవకాశం లేదని, కందుకూరు ఏరియా ఆసుపత్రికి వెళ్లండని ఉచిత సలహాలు ఇస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. దీంతో వేలకు వేలు ఖర్చు పెట్టి ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. అయినప్పటికీ సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వలేటివారిపాలెం సీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు


యనమల రామకృష్ణ

ఉలవపాడు, మార్చి 19 : ఓ నర్సింగ్ విద్యార్థి అదృశ్యంపై సోమవారం రాత్రి కేసు నమోదు అయ్యింది. ఎస్సై బాజీరెడ్డి, యువకుడి తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని రామాయపట్నంకు చెందిన యనమల రామకృష్ణ(20) ఒంగోలులోని ఓ ప్రైవేటు నర్సింగ్ కాలేజీలో మేల్ నర్సింగ్ చదువుతూ కాలేజి తరుపున ఎముకులు, కీళ్ల చికిత్సకు చెందిన ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అప్రెంటీస్ చేస్తున్నాడు. ఈనెల 8వ తేదీన శివరాత్రికి స్వగ్రామం వచ్చాడు. తిరిగి కాలేజికి వెళుతున్నాని 15వ తేది వెళ్లాడు. అప్పటి నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. కాలేజి చేరగానే ప్రతిసారి తల్లిదండ్రులకు ఫోన్ చెసి చెప్పే కొడుకు ఎంతటికి ఫోన్ ఆన్ కాకపోవడంతో రామకృష్ణ తండ్రి మహేశ్వరరావు నేరుగా ఒంగోలులోని నర్సింగ్ కాలేజి, ప్రైవేటు ఆసుపత్రిలో విచారించగా రాలేదని తెలిసింది. బంధుమిత్రులను విచారించి ఎలాంటి ఆచూకి తెలియకపోవడంతో ఉలవపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు యువకుడు అదృశ్యంపై ఎస్సై కేసు నమోదు చేశారు.

నాగబాబు, నాదెండ్లతో అళహరి భేటీ


నాగబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అళహరి సుధాకర్

కావలిటౌన్, మార్చి 19: జనసేన జాతీయ నాయకులు నాగబాబు, నాదెండ్ల మనోహర్‌లతో ఆ పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ మంగళవారం మంగళగిరి కార్యాలయంలో భేటీ అయ్యారు. సుధాకర్ మాట్లాడుతూ కావలి రాజకీయ పరిణామాలపై క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారని, జనసేన కార్యకర్తలపై సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. టీడీపీ, బీజేపీ పొత్తు పట్ల ప్రజల్లో స్పందనపై అడిగి తెలుసుకుని మిత్రపక్షాల అభ్యర్థుల గెలుపు కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారన్నారు. తాను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకుని 5 ఏళ్లు పూర్తయిందని అందుకు సహకరించిన నేతలకు కార్యకర్తలకు పవన్‌కల్యాణ్ అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

అంకమ్మ ఆలయంలో ఇంటూరి రాజేష్ పూజలు


పూజలు అనంతరం నాయకులతో ఇంటూరి రాజేష్

కందుకూరు, మార్చి 19: తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ మంగళవారం కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, రాజేష్ అనుచరులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, మార్చి 19 : మండలంలోని వీఆర్ కోట సమీపంలోని మన్నేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొన్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు సోమవారం అర్థరాత్రి ఒంటి గంట సమయంలో ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బందితో దాడి చేసి ఇసుకతో వస్తున్న ట్రాక్టర్‌ను స్థానిక రైసుమిల్లు వద్ద పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు.

ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇచ్చే బర్త్ సర్టిఫికెట్ చెల్లదు

వలేటివారిపాలెం, మార్చి 19 : ఇకపై ప్రైవేట్ ఆసుపత్రుల్లో తీసుకునే బిడ్డ బర్త్ సర్టిఫికెట్ చెల్లదని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 2023 అక్టోబరు 1వ తేది నుంచి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, జిల్లా ఏరియా ఆసుపత్రి, కమ్యూనిటీ హెల్త్ ఆసుపత్రి, పీహెచ్‌సీల్లో తీసుకునే బర్త్ సర్టిఫికెట్లు మాత్రమే చెల్లనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో, పంచాయతీలో, మున్సిపాలిటీలలో, ఏ ఇతర ప్రాంతాల్లో బిడ్డ జన్మించినప్పటికీ బర్త్ సర్టిఫికెట్ పైన సూచించిన ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే తీసుకోవాలని తెలిపారు.

ఎక్స్‌కవేటర్ తగిలి ఇద్దరు బాలికలకు తీవ్రగాయాలు


గాయపడిన బాలికను 108లో ఆసుపత్రికి తీసుకెళ్తున్న సిబ్బంది

వలేటివారిపాలెం, మార్చి 19 : మండలంలోని చుండి, పోలినేనిచెరువు గ్రామాల సమీపంలోని ప్రధాన రహదారిలో మంగళవారం ఎదురుగా వస్తున్న ఎక్స్‌కవేటర్ తగిలి ఇద్దరు బాలికలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు.. గరుకుపాలెంకు చెందిన చందన, చైత్ర అనే ఇద్దరు బాలికలు మరో యువకుడితో కలసి మోటారు సైకిల్‌పై వలేటివారిపాలెం హైస్కూల్‌కు వెళుతూ చుండి, పోలినేనిచెరువు గ్రామాల సమీపంలో ముందువెళుతున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో ఎదురుగా వస్తున్న ఎక్స్‌కవేటర్ తగిలింది. ఈ ప్రమాదంలో గాయపడిన బాలికలను బాలికలను 108 వాహనంలో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.

‘ప్రజాగళం’లో భద్రత వైఫల్యంపై విచారణ చేట్టాలి : కావ్య


మహాజన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కావ్య

కావలి, మార్చి 19: భారతప్రధాని నరేంద్ర మోదీకి భద్రత కల్పించలేని అధికారులు సామాన్య ప్రజలకు ఏమి రక్షణ కల్పిస్తారని కావలి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రజాగళం సభ భద్రతా వైఫల్యంపై విచారణ చేట్టాలని, దేశ ప్రధాని భద్రతను గాలికొదిలిన పోలీస్ ఉన్నతాధికారులపై సీఈసీ తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ లక్షలాది మంది జనం తోసుకువస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూస్తుండటం దేనికి సంకేతమన్నారు. ప్రధాని భద్రత, జనం, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలను పోలీస్ బాస్‌లు ఎందుకు పట్టించుకోలేదో చీఫ్ ఎలక్షన్ కమిషన్ సమగ్ర విచారణ జరపాలన్నారు. పోలీసుల వైఫల్యం కారణంగా జనం సభ వద్దకు రాలేక రోడ్లపైనే ఆగిపోవాల్సి వచ్చిందన్నారు.

మహాజన సైన్యం కార్యాలయం ప్రారంభం

పట్టణంలోని 12వ వార్డులో మహాజన సైన్యం జాతీయ అధ్యక్షుడు చేవూరు సురేంద్ర ఏర్పాటు చేసిన మహాజన సైన్యం కార్యాలయాన్ని మంగళవారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కావ్యకు వారు స్వాగతం పలికి ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని చెప్పారు.

మామిడి సాగులో సస్యరక్షణపై రైతులకు అవగాహన


మామిడిపై మంగు మచ్చలను చూపిస్తున్న జ్యోతి

ఉలవపాడు, మార్చి 19 : మామిడి సాగులో తీసు కోవాల్సిన సస్యరక్షణ చర్యలపై మండల ఉద్యాన అధికారి బీజ్యోతి మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. కరేడు పరిసర ప్రాంతంలో సాగులో ఉన్న మామిడి తోటల్లో ఆమె పర్యటించి రైతులతో సమావేశమయ్యారు. మామిడిపై ఉన్న మంగుమచ్చలకు కారణమైన తామర పురుగు నివారణకు తగిన సూచనలు, పిచకారి చేయాల్సిన పురుగు మందుల వివరాలు తెలిపారు. మామిడి పిందెలు కోడిగుడ్డు సైజులో ఉన్నప్పుడు కాయలపై పగుళ్లు ఏర్పడకుండా, అదేవిధంగా పిందెలు మంచి సైజు రావడానికి లీటరు నీటికి 2మిల్లీ లీటర్ల బోరాన్, 10 గ్రాముల పోటాషియం నైట్రేట్ కలిపి పిచకారి చేయాలని చెప్పారు. లింగాకర్ష బుట్టలు, ఫ్రూట్స్ కవర్లు వాడకం వలన పండు ఈగ నివారణ చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యాన సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

26వ వార్డులో టీడీపీ ఇంటింటి ప్రచారం


ఇంటింటి ప్రచారంలో ఇంటూరి సౌజన్య

కందుకూరు, మార్చి 19: పట్టణంలోని 26వ వార్డు తానికొండ వారికొష్టాలు, ఐఎన్ఆర్ గార్డెన్స్ ప్రాంతాలలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి జరగబోయే లబ్ధిని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో కందుకూరు నియోజకవర్గానికి టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించిన ఇంటూరి నాగేశ్వరరావును ఆదరించి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రత్తయ్య, ముచ్చు లక్ష్మీరాజ్యం, మర్రిపూడి మల్లికార్జున, వెంకటరమణయ్య, కేశినేని రమేష్, చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వారోత్సవాల ప్రారంభం

కావలిటౌన్, మార్చి 19: విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్ఎస్ఎస్ వారోత్సవాలు ప్రారంభమయ్యా యి. యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ మధుకర్ పర్యవేక్షణలో జరుగుతున్న వారోత్సవాల్లో భాగంగా పట్టణం, మండలంలోని ప్రాంతాల్లో పచ్చదనం పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్య పరిరక్షణ, విద్య, వైద్యం పట్ల అవగాహన కార్యక్రమాలతోపాటు సాంఘి క దురాచారాలపట్ల ప్రజల్లో చైతన్యం తేవడం మూఢ నమ్మకాలను పారదోలడం తదితర సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డాక్టర్ మధుకర్ తెలిపారు. విట్స్ ప్రిన్సిపాల్ దత్తాత్రేయ శర్మ వారోత్సవాలను ప్రారంభించగా విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అభినందించారు.

కందుకూరులో భద్రతాదళాల కవాతు


కవాతు నిర్వహిస్తున్న స్పెషల్ పార్టీ పోలీసులు

కందుకూరు, మార్చి 19: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రత్యేక భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. స్థానిక పోలీసులతో కలిసి పట్టణ ఎస్ఐ భాస్కర్ ఆధ్వర్యంలో మంగళవారం కందుకూరులో ప్రత్యేక బలగాలు కవాతు నిర్వహించాయి. గత కొన్నేళ్లుగా కందుకూరులో ప్రత్యేక పోలీసు బలగాలను చూడని స్థానికులు ప్రత్యేక బలగాల కవాతును చూసి అప్పుడే ఎన్నికల వేడి మొదలైందని చర్చించుకున్నారు.

పర్యాటక అవకాశాలు పుష్కలం.. అభివృద్ధి పట్టని ప్రభుత్వం


కాకుటూరులోని జైన్ దేవాలయం

వెంకటాచలం, మార్చి 19: కొన్ని రాష్ట్రాలు కేవలం పర్యాటక రంగమే ప్రధాన వనరుగా మనుగడ సాగిస్తున్నాయి. కానీ మన రాష్ట్రం మాత్రం ఉన్న పర్యాటక వనరులను వినియోగించుకోవడంలో విఫలమవుతున్నది. వెంకటాచలం మండలంలోనూ పర్యాటకానికి అనువైన ప్రదేశాలు అనేకం ఉన్నాయి. అయితే వాటిని గుర్తించి అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం శ్రద్ధ పెట్టడం లేదు. మండలంలోని కసుమూరు, గొలగమూడి, సర్వేపల్లి రిజర్వాయరు, కనుపూరు చెరువులను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే రాష్ట్రానికి అదనపు ఆదాయం లభించే అవకాశముంది. అంతేకాక కాకుటూరు వద్ద ప్రసిద్ధి చెందిన మహావీర్ మందిరం కూడా ఉంది. అలాగే గొలగమూడికి వెళ్లే మార్గంలో కంటేపల్లి వద్ద సాయిబాబా మందిరం ఉంది. వీటిని అభివృద్ధి చేస్తే పర్యాటకులు పెరిగే అవకాశం ఉంది. అలాటే ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుంది. ఆ దిశగా పాలకులు, అధికారులు ఆలోచించి, ఆయా ప్రదేశాలను అభివృద్ధి పరచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ వస్తే పర్యాటక రంగం అభివృద్ధి



టీడీపీ అధికారంలోకి వస్తే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని వెంకటాచలం మండలాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయిస్తారు. మరిన్ని విద్యా సంస్థలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తారు.

- గుమ్మడి రాజాయాదవ్

పర్యాటక ప్రాంతాలపై సర్వే జరపాలి



మండలంలో పలు పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వాటిపై సర్వే జరపాలి. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టి పర్యాటక కేంద్రాలను అభివృద్ధి పరిస్తే స్థానికులకు కూడా ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయి.

- డబ్బుగుంట సురేంద్ర, కాకుటూరు

వైభవంగా పోలేరమ్మ చద్ది మహోత్సవం


పోలేరమ్మకు సమర్పించిన చద్ది

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి19: మండలంలోని రేబాల గ్రామంలో మంగళవారం గ్రామదేవత పోలేరమ్మకు చద్ది మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా చద్ది, పసుపు, కుంకుమ, టెంకాయలు, వేపమండలతో మహిళలు ఆలయానికి చేరుకుని పోలేరమ్మకు నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు చద్ది, అంబలిని ప్రసాదంగా పంపిణీ చేశారు.

ఎన్నికల నియమావళి అమలుపై పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం : స్థానిక బస్టాండ్ సెంటరులో మంగళవారం జడ్పీ సీఈవో కన్నమనాయుడు ఎన్నికల నియమావళి అమలును పరిశీలించారు. రాజకీయ నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీల తొలగింపు, విగ్రహాలకు ముసుగులు వేయడాన్ని ఆయన పరిశీలించారు. నిబంధనల అమలుపై ఎంపీడీవో రాజ్యలక్ష్మిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు లేకుండా నియమావళిని అమలు చేయాలని ఆదేశించారు.

కులదూషణ కేసుపై డీఎస్పీ విచారణ

మనుబోలు : మండలంలోని కొమ్మలపూడిలో నమోదైన కులదూషణ కేసుపై మంగళవారం నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి విచారణ చేపట్టారు. ఈనెల 16న రాత్రి కొమ్మలపూడిలో ఏడుముళ్ల మస్తాన్, ఆయన భార్య వైదేహినిపై అదే గ్రామానికి చెందిన పెంచలయ్య, మనోహర్‌లు మూకుమ్మడిగా దాడిచేసి కులంపేరుతో దూషించారు. ఈనెల 17న బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయగా, డీఎస్పీ గ్రామానికి వచ్చి విచారణ చేపట్టారు.

పునరావాసం కల్పించకుండా నిద్రపోతున్నావా ?


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సోమిరెడ్డి

ముత్తుకూరు, మార్చి 19: నేలటూరు పట్టపుపాలెంను తరలించకుండా ఐదేళ్లు నిద్ర పోతున్నావా కాకాణీ.. అని టీడీపీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రశ్నించారు. నేలటూరు పట్టపుపాలెంలో మంగళవారం నిర్వహించిన బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జెన్‌కో థర్మల్‌ను ప్రైవేటీకరణ చేస్తుంటే ఏమి చేస్తున్నావు.. కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్ తరలిస్తుంటే ఏం చేశావ్.. ప్రజల నెత్తిన బూడిద జల్లి నీ జేబులు నింపుకోవడమే పనిగా పెట్టుకున్నావా ? అని కాకాణిని ప్రశ్నించారు. వైసీపీ రాక్షస పాలన అంతమొందించేందుకే జనసేన, బీజేపీతో కలిసి పోరాడుతున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బొమ్మి సురేంద్ర, పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సురేష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అధ్వానంపై జనసేన నిరసన


నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

తోటపల్లిగూడూరు : మత్స్యకార గ్రామాలయిన కోడూరు-వెంకన్నపాలెం గ్రామాల రోడ్లు అధ్వానంగా ఉన్నాయని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన నాయకుడు బొబ్బేపల్లి సురేష్ నాయుడు పేర్కొన్నారు. మండలంలోని వెంకన్నపాలెంలో అధ్వానంగా ఉన్న రోడ్డుపై మంగళవారం జనసైనికులు నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మత్స్యకార గ్రామాల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, ఇంత దారుణంగా రోడ్లు ఉంటే మరమ్మతులు చేయకపోవడం దారుణమన్నారు. త్వరలో ప్రజలు ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వాణి, శ్రీనివాసులు, నవీన్, అర్జున్, కోడూరు వెంకటేశ్వర్లు, శ్రీహరి పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

నా క్లయింట్ అయిన M/s. Repco Home Finance Ltd., బృందావనం, నెల్లూరు తరఫున బ్రాంచి మేనేజర్ గారు ఇచ్చిన అనుమతి మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా:- నా క్లయింట్‌కు కస్టమర్ అయిన శ్రీమతి అంబటి కనకమ్మ భర్త కృష్ణయ్య, నరుకూరు మజరా జానావారిపాళెం గ్రామం, తోటపల్లి గూడూరు మండలం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా అనువారు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని తనఖా ఉంచి ఋణసౌకర్యం పొందుటకు నా క్లయింట్‌ను సంప్రదించినారు. సదరు కనకమ్మ గారికి క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి తన భర్త గారైన అంబటి కృష్ణయ్య గారు రిజిష్టర్డు సెటిల్‌మెంటు పత్రం తేది: 04-05-2009 డాక్యుమెంటు నెం.457/2009 ద్వారా చెందజేసినారని చెప్పుచున్నారు. కావున క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవ్వరికేని ఎటువంటి ఆక్షేపణలు/అభ్యంతరములు మరియు ఏ ఇతరములైన ఉన్న యెడల ఈ పత్రికా ప్రకటన వెలువడిన తేది నుండి 7 రోజుల లోపల ఈ క్రింది అడ్రస్సుకు లిఖితపూర్వకముగా సరియగు ఆధార ములతో తెలుపుకోవలసినది. తదుపరి వచ్చు ఆక్షేపణలు నా క్లయింట్‌ను బద్ధగించవు. లేనిచో నా క్లయింట్ సదరు శ్రీమతి అంబటి కనకమ్మ గారికి ఋణము మంజూరు చేసెదరు.

ఆస్తి షెడ్యూలు

గూడూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ యిలాకా ఇందుకూరుపేట సబ్-రిజిస్ట్రారులో చేరిన శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా తోటపల్లి గూడూరు మండలం, నరుకూరు గ్రామ పంచాయితీ మరియు గ్రామంలో సర్వే నెం.1బి/12/3కుకు సంబంధించిన జిరు సెంట్-8-8కు, ఇంటి పన్ను అసెస్‌మెంట్ నెం.876కు గల 200 అంకణములు లేక 1600 చ.గజముల ఖాళీ స్థలము ఇల్లు వగైరాలకు హద్దులు: తూర్పు: మెంటా మధుసూదనరావు స్థలం, దక్షిణం: మెయిన్ రోడ్డు, పడమర: మారుబోయిన రమణయ్య భూమి, ఉత్తరం: మారుబోయిన రమణయ్య భూమి.

M.Mushtaq Ahmed, M.B.A., B.L., Advocate, D.No.23-1-957 (New), 23-1-82 (Old), Near Police Kalyanamandapam, Mulapet, Nellore-524003. Cell: 94414 43110

జట్లకొండూరులో ఆరోగ్య సురక్ష


ప్రజలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మనుబోలు, మార్చి 19: మండలంలోని జట్లకొండూరులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. మనుబోలు పీహెచ్‌సీ వైద్యురాలు గేయపూజిత తోపాటు పలువురు వైద్యులు ప్రజలకు వివిధ వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు మాళవిక, హరిప్రియ, పీఎంవో వెంకటలక్ష్మి, సీహెచ్‌వో రాజయ్య, కార్యదర్శి వెంకటరమణయ్య పాల్గొన్నారు.

నేడు టీడీపీ ఆత్మీయ సమావేశం

కొడవలూరు మార్చి 19: మండలంలోని నార్తురాజుపాలెంలో ఉన్న పీఎస్ఆర్ కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం నాలుగుగంటలకు నియోజకవర్గ టీడీపీ నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు మండల కమిటీ అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోవూరు టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొననున్నారని ఆయన తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

ఒంటరిగా ఎదుర్కోలేక జతకట్టారు : కాకాణి

పొదలకూరు, మార్చి 19 : సీఎం జగన్‌ను ఒంటరిగా ఎదుర్కొనే దమ్ము లేకనే 2014లాగా ముగ్గురు జతకట్టారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సినిమా హాల్ సెంటర్‌లో వైసీపీ ప్రాంతీయ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ మతతత్వ పార్టీలతో జతకట్టరని, కేంద్రంలో ఉన్న ప్రభుత్వంతో స్నేహపూర్వకంగా ఉంటాంతప్ప రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టబోమన్నారు. వలంటీర్ల వ్యవస్థను అపహాస్యం చేసిన చంద్రబాబు ఈ వ్యవస్థను కొనసాగిస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. సోమిరెడ్డికి సిగ్గు లేకుండా మైనింగ్ గురించి ఆరోపణలు చేస్తున్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కోనం బ్రహ్మయ్య, జడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, సురేష్‌కుమార్‌రెడ్డి, భారతమ్మ, సోమ భాస్కర్, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాకాణి

వలంటీర్‌పై చర్యలు తీసుకోండి : టీడీపీ

తోటపల్లిగూడూరు, మార్చి 19: సోషల్ మీడియాలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై అసభ్యకర పోస్టులు పెడుతున్న నరుకూరు వలంటీర్‌పై చర్యలు తీసుకోవాలని మండల టీడీపీ నాయకులు మంగళవారం తహసీల్దారు మాధవరెడ్డి, ఎంపీడీవో నారాయణరెడ్డిలకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం నాయకులు సన్నరెడ్డి సురేష్‌రెడ్డి, ఎంపీటీసీ కొణతం రఘుబాబు మాట్లాడుతూ నరుకూరు సచివాలయం పరిధిలో పని చేస్తున్న వలంటీరు ఆకుల నవీన్ రెండు రోజుల నుంచి వాట్సప్ గ్రూపుల్లో సోమిరెడ్డిపై అసభ్యకర పోస్టులు పెడుతున్నాడని, దీంతో టీడీపీ నేతల మనోభావాలు దెబ్బతింటున్నాయని వారు పేర్కొన్నారు. అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో గోపిరెడ్డి వెంకటేశ్వర్లు, పీ వెంకయ్య, ఇసుకపాలెం సర్పంచి ఇంగిలాల చైతన్యకుమార్, ఊటుకూరు అవినాష్, పైనం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

వీఎస్‌యూలో అంతర్జాతీయ సంఘ సంక్షేమ దినోత్సవం


అంతర్జాతీయ సంఘ సంక్షేమ దినోత్సవంలో పాల్గొన్న వీసీ సుందరవల్లి తదితరులు

వెంకటాచలం : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో మంగళవారం అంతర్జాతీయ సంఘ సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వీసీ సుందరవల్లి కార్యక్రమంలో మాట్లాడారు. సోషల్ వర్క్ విభాగం తరగతికే పరిమితం కాకుండా సమాజంలో సమస్యలకు పరిష్కారం మార్గాలను సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్‌కుమార్ బాబు, సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ కే సునీత, డాక్టర్ ఆర్ మధుమతి, డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల తనిఖీ

మనుబోలు : స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవతరగతి పరీక్ష కేంద్రాలను మంగళవారం ఏఎంవో, ఫ్లయింగ్ స్క్వాడ్ జి. సుధీర్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష గదుల్లోకి వెళ్లి పరీక్షలు రాసేవిధానాన్ని ఆయన గమనించి, వారిని మందలించారు.ఆయన వెంట ఎంఈవో, డీటీలు ఉన్నారు.

● 22 మంది గైర్హాజరు

వెంకటాచలం : మండలంలో ఏడు పరీక్ష కేంద్రాల్లో మంగళవారం హిందీ నిర్వహించారు. ఈ పరీక్షకు 22 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

నగరాన్ని అభివృద్ధి చేస్తా...

● టీడీపీ సిటీ అభ్యర్థి నారాయణ


జెండావీధిలోని ఓ దుకాణంలో టిఫిన్ చేస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న నారాయణ

నెల్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రాగానే నెల్లూరు నగరాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని మాజీ మంత్రి, నెల్లూరు సిటీ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ ప్రజలకు హామీ ఇచ్చారు. మంగళవారం నగరంలో ని జెండావీధి, పరిసర ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ఇంటింటికి తిరుగుతూ టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. జెండావీధిలో రోడ్లను బాగు చేస్తానని హామీ ఇచ్చారు. మన్సూర్‌నగర్ ప్రాంతంలో వర్షపునీరు నిలబడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటా మని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి పథకాలను పూర్తి చేసి దోమల రహిత నగరంగా నెల్లూరును మారుస్తానన్నారు. తనను సిటీ ఎమ్మెల్యేగా, వేమిరెడ్డి ప్రభా కర్‌రెడ్డిని నెల్లూరు ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. కాగా, నారాయణ కుమార్తె పొంగూరు షరిణి నగరంలోని 10వ డివిజన్‌లో ఇంటింటికి తిరుగుతూ ప్రజలతో మమేకమయ్యారు. సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేస్తూ రానున్న ఎన్నికల్లో కూటమిని ఆదరించాలని కోరారు.

జాబితాలో తప్పిదాలను త్వరగా పరిష్కరించండి

నెల్లూరు(సిటీ),మార్చి 19 : ఓటరు జాబితాలో తప్పిదాలుంటే యంత్రాంగం త్వరితగతిన పరిష్కరించాలని టీడీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ కోరారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేలా యంత్రాంగం పని చేయాలని, అందుకు తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఆర్వో, ఎన్ఎంసీ కమిషనర్ వికాస్ మర్మత్ నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశానికి నారాయణ హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తే నాణ్యమైన సమాజం ఏర్పడుతుందని చెప్పారు. ముందుగా సమీక్షలో మాట్లాడిన కమిషనర్ ఎన్నికల నియమ, నిబంధనలకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు సహకరించాలని కోరారు. అనుమతులు లేకుండా ఎలాంటి ప్రచార హోర్డింగ్స్, ఫ్లెక్సీలు, ప్రసార మాధ్యమాల్లో ప్రకటనలు ఇవ్వరాదన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నాయకులు తాళ్లపాక అనురాధ, సీపీఎం నుంచి కత్తి శ్రీనివాసులు, బీజేపీ నుంచి ముక్కు రాధాకృష్ణ, వైసీపీ నుంచి మహేష్ పాల్గొన్నారు.

ప్రజల మధ్యే ఉంటా.. కోటంరెడ్డి


కోటంరెడ్డిని ఆశీర్వదిస్తున్న మహిళలు

నెల్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని టీడీపీ రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం నగరంలోని 35వ డివిజన్ లేక్ వ్యూ కాలనీలో మాజీ కార్పొరేటర్ ప్రశాంత్ కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. గడిచిన తొమ్మిదేళ్లుగా ప్రజల మధ్యనే తిరిగానని, ఇకపై కూడా అలానే ఉంటానని చెప్పారు. కాగా 29వ డివిజన్ గాంధీనగర్‌కు చెందిన స్థానిక ముస్లిం యువత శ్రీధర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరింది. ఈ కార్యక్రమాల్లో కనపర్తి గంగాధర్, గుద్దేటి చెంచయ్య, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి ఉప్పుటూరు సర్పంచి రాజీనామా.. నేడు టీడీపీలోకి !

నెల్లూరు రూరల్: మండలంలోని ఉప్పుటూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ అంబటి వెంకట సుబ్బారెడ్డి వైసీపీకి రాజీనామా చేశారు. ఆయనతోపాటు ఉపసర్పంచ్ వెంకట రత్నం కూడా రాజీనామాను పార్టీ పెద్దలకు అందచేశారు. ఈ సమాచారం అందుకున్న టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఉప్పుటూరుకు చేరుకున్నారు. వారిద్దరితో భేటీ అయ్యారు. తమ పార్టీలోకి రావాలని ఆహ్వానించడంతో అందుకు వారివురు సుముఖత చూపారు. రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సమక్షంలో బుధవారం తామిద్దరం టీడీపీలో చేరుతున్నట్లు సర్పంచ్ సుబ్బారెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత కోడూరు కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ గెలిస్తే బెంగళూరు తరహా అభివృద్ధి : కోటంరెడ్డి


ప్రచారంలో టీడీపీ నాయకులు

నెల్లూరు (వైద్యం), మార్చి 19 : వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపిస్తే నెల్లూరు నగరంలో బెంగళూరు తరహాలో అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వెల్లడించారు. మంగళవారం 15వ డివిజన్‌లో గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణను గెలిపించాలని కోరారు. నారాయణకు ఉన్న విజన్, వేమిరెడ్డికి ఉన్న విస్తృత పరిచయాలు నెల్లూరు జిల్లా అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో కేపీ చౌదరి, కమ్మ కల్యాణ్, సురేష్, శంకర్ పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు వైద్య శిబిరం

నెల్లూరు (వైద్యం), మార్చి 19 : ఇండియన్ రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రంలో మానసిక దివ్యాంగుల కోసం మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. బీఎస్ఆర్ ఆసుపత్రి నిర్వాహకుడు డాక్టర్ శ్రీనివాసరావు బృందం దివ్యాంగులను పరీక్షించింది. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మానసిక దివ్యాంగ పిల్లలకు సేవలు అందించటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్, కార్యదర్శి మస్తానయ్య, కో కన్వీనర్ బలరామయ్య నాయుడు, దివ్యాంగుల కేంద్రం ప్రిన్సిపాల్ గురునాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలను పాటించండి

● ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు వసూలు చేయండి : ట్రాన్స్‌కో డైరెక్టర్ సుబ్బారాజు


సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డైరెక్టర్ సుబ్బారాజు

నెల్లూరు (జడ్పీ), మార్చి 19 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున విద్యుత్ ఉద్యోగులు, అధికారులు ఎన్నికల నియమావళిని అనుసరిస్తూ విధులు నిర్వహించాలని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బారాజు ఆదేశించారు. మంగళవారం నగరానికి వచ్చిన ఆయన ఆటోనగర్ సబ్ స్టేషన్‌ను తనిఖీ చేసి ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర పరికరాలను పరిశీలించారు. అనంతరం నగర డివిజన్ అధికారులతో సమీక్ష జరిపారు. జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు ఎక్కువగా ఉన్నాయని, వాటన్నింటిని వసూలు చేయాలని సూచించారు. జిల్లాలో 2942 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, వాటన్నింటికీ విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో విద్యుత్ పంపిణీలో ఇబ్బందులు ఏర్పడకుండా అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్ఈ విజయన్, ఈఈ సోమశేఖర్‌రెడ్డి, డీఈలు మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన వేతనాలు అమలు చేయాలి

● డీఎంహెచ్‌వోకు ఉద్యోగ సంఘాల వినతి

నెల్లూరు (వైద్యం), మార్చి 19 : కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెంచిన వేతనాలు అమలు చేయాలని కోరుతూ మంగళవారం డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్యకు ఉద్యోగ సంఘాలు వినతిపత్రం అందించాయి. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాజా మస్తాన్ మాట్లాడుతూ జీవో నెంబర్ 5 ప్రకారం స్టాఫ్ నర్సులకు రూ.38,720 వేతనం ఇవ్వాల్సి ఉందన్నారు. అలాగే జీవో నెంబరు 686. 142 ప్రకారం రూ. 34వేలు ఇవ్వాల్సి ఉండగా, రూ.27675 మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులకు రూ.32670 ఇవ్వాల్సి ఉంటే ప్రస్తుతం 23,393 మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. పెంచిన వేతనాలకు జీవోలు విడుదల చేసిన ప్రభుత్వం మరలా జీవోలను విడుదల చేసి వేతనాలు తగ్గించటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈహెచ్‌ఎస్ రూ.5లక్షలకు పెంచాలి

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 19 : నగరంలోని పెన్షన్ భవన్‌లో మంగళవారం జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్‌కార్డు మొత్తాన్ని రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచాలని కోరుతూ తీర్మానం చేశారు. పీపుల్స్ క్లినిక్ డాక్టర్ ఎంవీ రమణయ్య వేసవికాలంలో వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ రమణయ్య రాష్ట్ర మహాసభ తీర్మానాలు వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు ఎన్ శ్రీనాథ్, ట్రెజరర్ జే హజరత్తయ్య, ఉపాధ్యక్షులు వీ వీరేంద్రనాథ్, ఎస్‌కే ఖాసిం, సంయుక్త కార్యదర్శి కే సుబ్బారావు, టెక్నికల్ టీం సభ్యులు, సిబ్బంది, పాల్గొన్నారు.

'ప్రజాగళం' భద్రతా వైఫల్యంపై విచారణ జరపాలి

● కోవూరు టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), మార్చి 19 : దేశ ప్రధాని పాల్గొన్న ప్రజాగళం సభలో భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టాలని కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఓ ప్రకటనలో కోరారు. ప్రధాని మోదీ హాజరవుతున్నారని తెలిసి కూడా అధికారులు నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. దీని వల్ల భారీగా ట్రాఫిక్ జామ్ అయిందని, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు సమాయానికి సభా ప్రాంగణానికి చేరుకోలేకపోయారని పేర్కొన్నారు. జనాలను నియంత్రించాలని స్వయానా ప్రధాన మంత్రి మోదీ చెప్పారంటే పోలీసుల నిర్లక్ష్య వైఖరి ఎలా ఉందో అర్థం అవుతుందన్నారు. కాగా, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రశాంతి దంపతులను వారి నివాసంలో మంగళవారం కోవూరు నియోజకవర్గ గుమ్మళ్లదిబ్బ నాయకులు, కార్యకర్తలు కలిసి మద్దతు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వై రమణమ్మ, వై హరిబాబు, వినయ్ కుమార్, మహిళలు పాల్గొన్నారు.

గుంటుపల్లి మరణం బాధాకరం

నెల్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జాతీయ క్రమశిక్షణ కమిటీ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి నాగేశ్వరరావు అనారోగ్యంతో మంగళవారం నరసరావుపేటలో కన్ను మూశారు. ఆయన గతంలో జిల్లా పరిశీలకుడిగా కూడా పనిచేశారు. నాగేశ్వరరావు మృతిపై టీడీపీ ముఖ్య నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్రమశిక్షణ కలిగిన నేతను కోల్పోవడం పార్టీకి తీరని లోటని పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో సంతాపం ప్రకటించారు. బీసీ వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన నాగేశ్వరరావు లేరన్న విషయం తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. గుంటుపల్లి మరణం పార్టీకి తీరని లోటు అని నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. మంచి వ్యక్తిత్వం కలిగిన బీసీ నాయకుడిని కోల్పోవడం బాధాకరమని బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంజాం రాఘవేంద్ర ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.

హనుమాన్‌కు ద్రాక్ష రస అభిషేకం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 19 : నగరంలోని పప్పులవీధి ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి పచ్చ ద్రాక్ష పళ్ల రసంతో అభిషేకాలు ఘనంగా జరిగాయి. లోక కల్యాణం కోసం స్వామి వారి భక్తులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం హనుమాన్‌కి ద్రాక్ష పళ్లతో అలంకారం, సహస్రనామార్చన, పల్లకి సేవ జరిగాయి. ఆలయ ధర్మకర్తల కమిటీ పర్యవేక్షించింది.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

నెల్లూరు (విద్య), మార్చి 19 : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలు ఎలా సాధించాలన్న దానిపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓవెల్ ఐఏఎస్ అకాడమీ ప్రతినిధి వెంకట కృష్ణయ్య, అధ్యాపకులు డాక్టర్ వై వెంకటేశ్వర్లు, ఎస్ ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, డీకేడబ్ల్యూ కళాశాల విద్యార్థినులు రూరల్ మండలం కొండ్లపూడి గ్రామంలో పరిసరాలను పరిశుభ్రపరిచారు. ఆ పల్లెలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ క్యాంప్‌లో భాగంగా మంగళవారం చెరువు ప్రాంతంలో వ్యర్థాలను తొలగించి పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ పీ ఉమామహేశ్వరి, డాక్టర్ వై దివ్య, డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్లపై పశువులు గోశాలకు..

నెల్లూరు(సిటీ),మార్చి 19 : నగరంలో రోడ్లపై విచ్చలవిడిగా పశువులు సంచరిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తుండటంతో కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ ఆరోగ్య అధికారులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రోడ్లపై కనిపించిన పశువులను వాహనాల్లో ఎక్కించి కల్లూరుపల్లిలోని గోశాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు, కూడళ్లలో ఉన్న పశువులను వాహనాల్లో గోశాలకు తరలించారు. నగరంలో పశువుల సంచారాన్ని నిషేధించామని ఎంహెచ్‌వో వెంకట రమణయ్య తెలిపారు. దీనిని పశువుల యజమానులు గుర్తించాలని సూచించారు.

నేత్రదానం

నెల్లూరు (వైద్యం), మార్చి 19 : నగరంలోని గోమతి నగర్ కు చెందిన పూనూరు జయ రామిరెడ్డి(88) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. నేత్రా లను జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఐ డొనేషన్ కౌన్సిలర్ బాలాజీ సింగ్, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆసుపత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. నేత్రదాన మోటివేటర్, మన సేవాసంస్థ వ్యవస్థాపకుడు దేవెళ్ల శ్రీనివాసులురెడ్డి సహకారంతో ఈ నేత్రాలను సేకరించారు. నేత్రదానం చేయదలచిన వారు 9347111033 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200

ఉలిక్కిపడ్డ సూళ్లూరుపేట


ప్రమాదం జరిగిన గోదాము

- బాణసంచా తయారీ కేంద్రంలో ప్రమాదం
- ఆరుగురికి గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం

నిబంధనల ఉల్లంఘనపై లైసెన్సు రద్దుకు సిఫార్సు


ఆస్పత్రిలో క్షతగాత్రులు - కాలిన గాయాలతో రవి

సూళ్లూరుపేట, మార్చి 19: టపాకాయల తయారీ కేంద్రంలో సంభవించిన పేలుడుతో మంగళవారం మధ్యాహ్నం సూళ్లూరుపేట ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పట్టణ సమీపంలోని వట్రపాలెం దగ్గర్లో జాతీయ రహదారి పక్కనే మదీనా గ్రాండ్ ఫైర్ వర్క్స్ పేరుతో బాణసంచా తయారీ కేంద్రం చాలాకాలంగా నిర్వహిస్తున్నారు. దీని లైసెన్సుదారులు ముబీష్, ఆయన భార్య సాధీనబేగం కాగా ఈ కేంద్రాన్ని ప్రస్తుతం వారి కుమారులిద్దరు నిర్వహిస్తున్నారు.11 గంటల సమయంలో టపాకాయల తయారీ కేంద్రంలో ప్రమాదం చోటు చేసుకోగా ఒక్కసారిగా భారీ శబ్దాలతో పేలుళ్ల సంభవించాయి.దీంతో ఎగిసిన మంటల తాకిడికి బయట ఉన్న టపాకాయల నిల్వలు కూడా పేలిపోయాయి.ఈ పేలుళ్ల ధాటికి గోదాములోనే పనిచేస్తున్న ముగ్గురు కూలీల శరీరం చాలావరకూ కాలిపోయింది. మరో ముగ్గురికి గాయాలయ్యాయి.గాయపడిన వారిలో బీహార్‌కు చెందిన శంకర్ చౌదరి, వింకేష్ జాదవ్, రాజ్‌కుమార్, గండ్ మండేల్, జార్ఖండ్‌కు చెందిన రవిలతో పాటు వట్రపాలేనికే చెందిన కందుకూరి శివకుమార్ వున్నారు.గోడౌన్ నుంచి శబ్దాలు విన్న చుట్టుపక్కల జనం ఏమి జరిగిందో తెలియక టపాసుల గోడౌన్ వైపు పరుగులెట్టారు. పేలుళ్లు, మంటలతో ఉన్న వాతావరణం చూసి అందరూ భయపడిపోయారు. గోడౌన్ నుంచి మంటలతో కూడిన దట్టమైన పొగలు వస్తుండడంతో ఇంకా పేలుడు మందులు ఉన్నాయోమోనన్న అనుమానంతో అక్కడకు చేరుకొన్న జనాలు కొంతసేపు హైవే రోడ్డు పైనే ఉండిపోయారు.ఈలోపు క్షతగాత్రుల్లో ఇద్దరు మంటల్లో నుంచి బయటకు వచ్చి లోపల ఇంకా కూలీలున్నారని చెప్పడంతో కాలిన గాయాలతో ఉన్న నలుగురిని స్థానికులే బయటకు తీసుకొచ్చారు. వారిని ఆటోల్లో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకొన్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని వ ం ంట ల న ్ ం అదుపుచేశారు. ఆర్డీవో చంద్రముని, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, డీఎస్పీ శ్రీనివాసుల రెడ్డి, సీఐ మధుబాబు, ఎస్ఐ రహీం రెడ్డి అక్కడకు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకొన్నారు. బాణసంచా గోదాము వద్ద నిబంధనల మేరకు ఎటువంటి జాగ్రత్త చర్యలు కూడా లేనట్లు గుర్తించారు. పేలుడుకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు ఆర్డీవో తెలిపారు.తరువాత ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించి ప్రమాదం ఎలా జరిగిందో అడిగి తెలుసుకొన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామన్నారు.తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలించారు.పేలుడు సంఘటనపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. టపాసుల తయారీ కేంద్రం లైసెన్సు రద్దుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేశామని ఆర్డీవో తెలిపారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆస్పత్రి వద్ద వైద్యులను వివరాలడిగి తెలుసుకొంటున్న ఆర్డీవో, డీఎస్పీ

లక్షితను చంపిన చిరుత గుర్తింపు

- అడవిలో వదలం.. జూలోనే ఉంచుతాం: అటవీశాఖ అధికారి



మంగళం, మార్చి 19: తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం తిరుమల కాలి నడకదారిలో వెళుతున్న నెల్లూరు బాలిక లక్షితపై దాడిచేసి, క్రూరంగా చంపేసిన చిరుతను గుర్తించారు. 2023 ఆగస్టులో ఈ హృదయ విదారకమైన ఘటన జరిగింది. వెంటనే స్పందించిన టీటీడీ, అటవీశాఖ అధికారులు దాడి జరిగిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీప ప్రాంతాల్లో బోన్లను ఏర్పాటు చేశారు. వరుసగా ఆరు చిరుతలు చిక్కాయి. వీటినుంచి పలు నమూనాలను, లక్షితకు సంబంధించిన నమూనాలను ల్యాబ్‌కు పంపారు. ముందుగా పట్టుబడ్డ మూడు చిరుత నమూనాల్లో లక్షితను చంపినట్లు ఆధారాలు లభించలేదు. నాల్గవ చిరుత నమూనాల్లో ఆధారాలు లభించాయి. ల్యాబ్ నుంచి ఆధారాలు నెలరోజుల్లో వస్తాయని అటవీశాఖ అధికారులు భావించినా.. దాదాపు ఏడు నెలలు సమయం పట్టింది. కాగా, ముందుగా పట్టుబడ్డ మూడు చిరుతల్లో రెండింటిని జనారణ్యానికి దూరంగా అటవీప్రాంతంలో వదలిపెట్టారు. ఓ చిరుతను విశాఖ పట్టణం జూకు తరలించారు. మిగిలినవి జూలోనే ఉన్నాయి. మంగళవారం ల్యాబ్ నుంచి వచ్చిన రిపోర్టు ఆధారంగా లక్షితను చంపిన నాల్గవ చిరుతను జూపార్కులోనే ఉంచనున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి సతీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎందుకంటే ఈ చిరుత.. జంతువులను వేటాడి తినే పరిస్థితిలో లేదని, కోరపళ్లు నాలుగు రాలిపోయాయన్నారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకునే జూపార్కులోనే ఉంచాలని నిర్ణయించినట్లు వివరించారు.

టెన్త్ పరీక్షకు 1073 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మార్చి 19: పదో తరగతి పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 1,073 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ చెప్పారు. మంగళవారం లాంగ్వేజ్-2 పరీక్ష జరిగింది. 27,878 మంది హాజరుకావాల్సి ఉండగా 26,805 మంది హాజరయ్యారు. 03.85 శాతం మంది గైర్హాజరవగా, 96.15 శాతం మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

పరీక్షల విధులనుంచి సీఎస్, డీవో తొలగింపు

సోమవారం జరిగిన పదో తరగతి పరీక్షల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఓ చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్), డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ (డీవో)ను పరీక్షల విధులనుంచి డీఈవో తొలగించారు. స్థానిక తిరుమల బైపాస్ రోడ్డులోని రత్నం హైస్కూల్లో పరీక్షకు హాజరైన వర్షిణి హాల్ టికెట్‌లో లాంగ్వేజ్-1కి సంబంధించి స్టార్ గుర్తులు ఉండడంతో సీఎస్, డీవో తికమక పడ్డారు. విద్యార్థినిని పరీక్ష కేంద్రం నుంచి బయటకు పంపేశారు. దాంతో ఆ విద్యార్థిని బోరున విలపిస్తూ కేంద్రం బయటకు వచ్చింది. ఆమె కుటుంబీకులు ఈ విషయాన్ని విద్యాశాఖాధికారులకు తెలియజేశారు. పరిశీలించిన ప్రభుత్వ పరీక్షల విభాగం సహాయ సంచాలకుడు (ఏసీ) గురుస్వామిరెడ్డి ఆ విద్యార్థిని అనుమతించాలని పరీక్ష కేంద్రం సీఎస్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో పరీక్ష ప్రారంభమైన అరగంట తర్వాత ఆమెను పరీక్షకు అనుమతించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ పరీక్షల విధులనుంచి సీఎస్, డీవోలను డీఈవో తొలగించారు.

బరి తెగించారు!

స్వర్ణముఖిలో పేట్రేగిపోతున్న ఇసుక మాఫియా




తిరుచానూరు, మార్చి 19: వాగూవంక తేడా లేకుండా ఇష్టానుసారం వైసీపీ నేతలు ఇసుక,మట్టి దోచేస్తున్నారు.తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం నుంచి రేణిగుంట మండల సరిహద్దు వరకు స్వర్ణముఖి నదిలో మట్టి, ఇసుకను కొంత మంది వైసీపీ నేతలు ప్రధాన ఆదాయ వనరులుగా మార్చుకున్నారు. తిరుచానూరు సమీపంలోని స్వర్ణముఖి నదిలో హిటాచి, ఎక్సకవేటర్లతో ట్రాక్టర్లతో మట్టిని తవ్వి వెంచర్లకు తరలిస్తున్నారు.నదిలో ఎక్కడికక్కడ గోతులు తవ్వేసి టన్నుల కొద్దీ మట్టి, ఇసుకను తీసుకెళుతున్నా అధికారుల్లో స్పందన లేదు.రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. నియోజకవర్గంలో ముఖ్య నేత వేస్తున్న అక్రమ వెంచర్‌కు వందల ట్రాక్టర్లతో రాత్రీపగలూ తేడా లేకుండా మట్టి రవాణా సాగుతోంది.ఇలాగే మరికొన్ని రోజులు సాగితే భూగర్భ జలాలు అడుగంటిపోయి తిరుచానూరు, పాడిపేట, ముండ్లపూడి ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రమయ్యే అకాశం ఉంది.

ఆస్పత్రి ఆవరణలో మద్య సేవనం

- విధుల్లో ఉండగా పట్టుబడ్డ రుయా వాటర్ మ్యాన్
- బార్‌ను తలపించేలా సీఐటీయూ కార్యాలయం



నాలుగు రోజుల కిందట విధుల్లో ఉండగా మరో వ్యక్తితో కలిసి మద్యం తాగుతూ పట్టుబడ్డ ఉద్యోగి - సీఐటీయూ కార్యాలయంలో మద్యం బాటిళ్లు, గ్లాసులు

తిరుపతి సిటీ, మార్చి 19: రుయాస్పత్రి ఆవరణలోని ఓ కార్యాలయం వెనుక గదిలో మరో వ్యక్తితో కలిసి ఓ ఉద్యోగి మద్యం తాగుతూ అధికారులకు పట్టుబడ్డాడు. ఆస్పత్రిలో వాటర్‌మ్యాన్‌గా పనిచేసే సుబ్రహ్మణ్యం ఓపీ కేంద్రం ఎదురుగా ఉన్న సీఐటీయూ కార్యాలయంలో నాలుగు రోజుల కిందట మధ్యాహ్నం మద్యం తాగుతున్నాడన్న సమాచారంతో ఏఆర్ఎంవో హరికృష్ణ అక్కడికెళ్లారు. మరో వ్యక్తితో కలిసి వాటర్ మ్యాన్ సుబ్రహ్మణ్యం మద్యం తాగుతుండటాన్ని గుర్తించారు. బారును తలపించేలా కార్యాలయం వెనుక ఓ గదిని ఏర్పాటు చేసి.. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విధుల్లో ఉండాల్సిన ఉద్యోగి దర్జాగా మద్యం తాగుతూ ఉండటాన్ని ఆయన గమనించి వెంటనే కార్యాలయానికి పిలిపించారు. కానీ తర్వాత ఏం జరిగిందో.. మద్యం తాగుతూ పట్టుబడ్డ ఉద్యోగిని మందలించి పంపేసినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే.. వాటర్‌మ్యాన్‌కి అండగా అధికార పార్టీ నేతలు ఉండటంతో ఆయన గతంలోనూ విధుల్లో ఉన్నప్పుడు ఆస్పత్రిలోనే మద్యం తాగేవాడని చెబుతున్నారు. అధికార పార్టీ నేతలతో ఉన్న సంబంధాలకు తలొగ్గి.. అధికారులు సైతం ఆయనపై చర్యలు తీసుకోవడానికి సాహసించడం లేదన్న విమర్శలొస్తున్నాయి.

మడిబాక వలంటీరుపై వేటు

ఏర్పేడు, మార్చి 19: వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఒక వలంటీరును విధుల నుంచి తొలగించారు.ఏర్పేడు మండలం మడిబాకలో సోమవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి చేపట్టిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో అదే గ్రామానికి చెందిన వలంటీరు మునలిపేడు మురళి పాల్గొన్నారు.ఈ విషయంపై మీడియాలో వార్తలు రావడంతో స్పందించిన కలెక్టర్ లక్ష్మీశ వెంటనే విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు.దీంతో ఎంపీడీవో గిడ్డయ్య వలంటీరు మురళిని విధుల నుంచి మంగళవారం తొలగించారు.

తిరుపతిలో నెలాఖరులోపు బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

- పీజీఎం అమరేంద్ర రెడ్డి



తిరుపతి సెంట్రల్ మార్చి 19: తిరుపతి నగరంలో ఈనెలాఖరులోపు బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని జిల్లా ప్రిన్సిపల్ జనరల్ (పీజీఎం) మేనేజరు సి.అమరేంద్ర రెడ్డి తెలిపారు. నాలుగేళ్ల కిందటి నుంచే ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లె, చిత్తూరు, పీలేరు, పుంగనూరు, పలమనేరు, కలికిరి, పాకాల కేంద్రాల్లో విదేశీ పరిజ్ఞానంతో 4జీ సేవలను అంచెలంచెలుగా మొదలుపెట్టారు. అలాగే తిరుపతిలోనూ ప్రారంభిస్తామని అప్పట్లో అధికారులు ప్రకటించారు. అయినా నగరంలో ఇప్పటి వరకు 4జీ సేవలు అందుబాటులోకి రాలేదు. ఈ నేపథ్యంలో స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన పరికరాలు వస్తున్నాయని, ఇవి వచ్చాక 4జీ సేవలు ప్రారంభిస్తామని పీజీఎం అన్నారు.

38 నూతన టవర్ల మంజూరు

తిరుపతి పరిధిలో 38 నూతన 4జీ టవర్లు మంజూరయ్యాయి. వీటిల్లో మొదటి విడతగా 18 టవర్లు నెలాఖరులోపు అందుబాటులోకి రానున్నట్లు సమాచారం.

మేకిన్ ఇండియాలో భాగంగా..

మేకిన్ ఇండియాలో భాగంగా.. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 4జీ పరికరాలను కేంద్రప్రభుత్వం బీఎస్ఎన్ఎల్‌కు సమకూరుస్తున్నట్లు సమాచారం. ఈ పరికరాలు మరో వారంలో తిరుపతికి చేరనున్నాయని అధికారులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులను గెలిపించండి

- బీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 19: సామాజిక న్యాయం లక్ష్యంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులను గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు విజ్ఞప్తి చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో ఆధిపత్య కులాలకు చెందిన వారే సకల రంగాలను నాశనం చేశారని విమర్శించారు. మరోవైపు జనాభాలో 80శాతం ఉన్న బహుజనులు నేటికీ అధికారానికీ, అవకాశాలకూ దూరంగా ఉండటం అన్యాయమన్నారు. ఈ దశలో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతో కలిసి ప్రాంతీయ పార్టీ ఏర్పాటు చేయాలన్న యోచనలో ఉన్నట్టు వెల్లడించారు.కేంద్రంలో బీజేపీ, కాంగ్రెస్, రాష్ట్రంలో వైసీపీ, టీడీపీ, జనసేనకు ప్రత్యామ్నాయంగా భావ సారూప్యత గల వ్యక్తులు, శక్తులతో ఈ పార్టీని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ దఫా తమ పార్టీ తరఫున ఎన్నికల్లో అభ్యర్థులను పోటీకి పెట్టడం లేదన్నారు. అయితే, భావ సారూప్యత కల్గిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థుల గెలుపునకు తోడ్పడతామన్నారు.సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖరాచార్య, జిల్లా కార్యదర్శి గణేష్, వినోద్‌గౌడ్, మధుసూదనాచారి, మహేష్‌యాదవ్, పొలకల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం): సా. 6.27
సహరి (గురువారం) : ఉ. 4.57

చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడిగా సీఆర్‌రాజన్



తిరుపతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడిగా తిరుచానూరు మాజీ సర్పంచ్ సీఆర్ రాజన్ నియమితులయ్యారు.ఇప్పటి వరకూ ఆ పదవిలో వున్న పులివర్తి నానీ చంద్రగిరి నియోజకవర్గ ఇంఛార్జిగానూ, టీడీపీ అభ్యర్థిగానూ ఎన్నికల్లో బిజీగా వుండడంతో ఆయన స్థానంలో రాజన్‌ను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియమించారు. తిరుచానూరు ప్రాంతంలో ప్రాబల్యం కలిగిన రాజన్ వన్నియకుల క్షత్రియ సంఘం రాష్ట్ర కోశాధికారిగా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా పని చేశారు. ఈ ఎన్నికల్లో చిత్తూరు అసెంబ్లీ టికెట్ ఆశించారు. దీనికోసం ఆయన చిత్తూరుకు మకాం మార్చి కొంత కాలం అక్కడే పార్టీలో చురుగ్గా పనిచేశారు. అయితే పలు సమీకరణల కారణంగా ఆయనకు టికెట్ దక్కలేదు. దానివల్ల ఆయనకు పార్టీలో సముచిత గుర్తింపు, గౌరవం కల్పించడంతో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో గణనీయంగా వున్న వన్నెకుల క్షత్రియ సామాజికవర్గాన్ని సంతృప్తి పరిచేందుకు రాజన్‌కు కీలక పదవి కట్టబెట్టారు. కుప్పం మొదలుకుని చిత్తూరు, చంద్రగిరి, నగరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో వన్యకుల క్షత్రియులు అధికంగా వున్నారు. ఆ సామాజికవర్గంలో ప్రాబల్యం కలిగిన రాజన్‌కు చిత్తూరు పార్లమెంటు అధ్యక్ష పదవి కేటాయించడం టీడీపీకి గణనీయంగా లాభించనుంది. చంద్రగిరి నియోజకవర్గంలో ఈసారి ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని హోరాహోరీగా పోరాడుతున్న పులివర్తి నానీ వ్యూహాత్మకంగా రాజన్‌కు ఈ పదవి దక్కేలా అధినేత చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం.చిత్తూరు పార్లమెంటు ఉపాధ్యక్షులుగా ఇ.శ్రీనివాసులు (చిత్తూరు) వీసీ మణి (రామచంద్రా పురం), వాణిజ్యవిభాగం ఉపాధ్యక్షుడిగా ఎస్‌పి ప్రసాద్ రెడ్డి, ఎం.గోపి (చిత్తూరు), సాంస్కృతిక విభాగం ఉపాధ్యక్షుడిగా జి.రమేష్, టీచర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా ఎస్.నరసింహులు (చిత్తూరు) నియమితులయ్యారు.

నారా భువనేశ్వరి పర్యటనను

విజయవంతం చేయండి


కార్యక్రమంలో మాట్లాడుతున్న పాశం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 19: వాకాడు మండలంలోని తిరుమూరులో ఈ నెల 22వ తేదీన జరుగనున్న నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడిని మఅక్రమంగా అరెస్ట్ చేసిన సమయంలో ప్రాణాలు కోల్పోయిన టీడీపీ కుటుంబ సభ్యులను భువనేశ్వరి కలసి భరోసా కల్పిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా తిరుమూరు గ్రామానికి ఈనెల 22న వస్తున్నారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, అబ్దుల్ రహీమ్, పల్లంపర్తి మధురెడ్డి, ఇశ్రాయిల్‌కుమార్, గణపర్తి కిషోర్‌నాయుడు, బిల్లు చెంచురామయ్య, దువ్వూరు మధురెడ్డి, పట్టాభిరెడ్డి, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, కోటేశ్వరరెడ్డి, సురేష్‌బాబు తదితతరులు పాల్గొన్నారు.

కూటమికి 140 పైగా సీట్లు: వేమన సతీష్


గాంధీ విగ్రహం వద్ద ఎన్‌ఆర్‌ఐలు

కోట, మార్చి 19: త్వరలో జరగబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి 140కి పైగా స్థానాల్లో విజయం సాధిస్తుందని తానా మాజీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వేమన సతీష్ అన్నారు. కోట పట్టణం, విద్యానగర్‌లో మంగళవారం సతీష్‌తో పాటు పలువురు ఎన్‌ఆర్‌ఐలు ప్రచారం నిర్వహించారు. టీడీపీని గెలిపించి చంద్రబాబును సీఎంగా చేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవాలని కోరకుంటూ గ్రామదేవత కోటమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, చంద్ర, తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి వాకా విజయభాస్కర్‌రెడ్డి, దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, సుబ్రహ్మణ్యం యాదవ్, శ్రీనివాసులు, పలువురు ఎన్‌ఆర్‌ఐలు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి సమష్టి పోరాటం: నెలవల


సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, మార్చి 19: టీడీపీ విజయానికి సమష్టిగా పోరాటం చేద్దామని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండలంలోని శిరసనంబేడు గ్రామంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్ని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఎన్నికల్లో వైసీపీ ఎన్ని కుయుక్తులు పన్నినా వాటిని ఎదుర్కొనేందుకు అందరూ సంసిద్ధంగా ఉండాలని సూచించారు. రానున్న ఎన్నికలలో గెలుసే లక్ష్యంగా పోరాడేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని, విజయశ్రీని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని కార్యకర్తలు ఆయనకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు మునసూరు రామచంద్రారెడ్డి, వేలూరు హరిబాబురెడ్డి, వేలూరు కల్యాణ్‌రెడ్డి, నేలవల్లి సిద్ధులయ్య నాయుడు, దార్ల రాజేంద్ర, శిరసనంబేటి సుధాకర్‌రెడ్డి, గోను బాబు, సుజాతమ్మ, స్థానిక సర్పంచు గుంటపూడి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

'సమష్టి నిర్ణయంతో ముందుకు పోదాం'

బాలాయపల్లి, మార్చి 19: సమష్టి నిర్ణయంతో ముందుకు పోదామని వైసీపీ అసంతృప్త నేతలు నిర్ణయించినట్లు తెలిసింది. మంగళవారం వెంకటగిరికి చెందిన కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి బాలాయపల్లి మండలంలోని జయంపు గ్రామానికి వెళ్లి ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ శింగంశెట్టి భాస్కర్‌రావును కలిసి భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడినా నియోజకవర్గ ఇన్‌చార్జిగా నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి వచ్చాక తమకు తగిన గుర్తింపు లేదని, అందుకే పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నామని ఇటీవల ఎంపీ గురుమూర్తితో చెప్పారు. ఈ క్రమంలోనే వైసీపీ అసంతృప్త నేతలు సమావేశమైనట్లు తెలిసింది.

పౌష్టికాహారం తీసుకోండి


ర్యాలీ చేస్తున్న అంగన్వాడీ సిబ్బంది

చిల్లకూరు, మార్చి 19: అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సీడీపీవో మెహబూబీ అన్నారు. మంగళవారం స్థానిక శంకరన్ గిరిజనకాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కాలనీలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ రక్తహీనత, బలహీనంగా ఉన్న మహిళలు అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా శక్తివంతంగా, ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో రేణుక, ఇంద్రమ్మ, సుజాతమ్మ, ప్రసన్నమ్మ, కమలమ్మ, పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆధునికతను సంతరించుకున్న గ్రంథాలయాలు

జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 19: గ్రంథాలయాలు ఆధునికతను సంతరించుకున్నాయని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ వీసీ కృష్ణమూర్తి అన్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రకు చెందిన 75 మంది జాతీయ గ్రంథాలయాల నిర్వాహకులకు ఎస్వీయూ సెనేట్ హాల్లో మంగళవారం పునశ్చరణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈనెల 23వ తేదీ దాకా సాగే తరగతులను విద్యాపీఠం వీసీ ప్రారంభించి, ప్రసంగించారు. నేషనల్ మిషన్ ఆన్ లైబ్రరీస్(ఎన్ఎంఎల్), రాజారామ్ మోహన్ రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ సంయుక్తంగా గ్రంథాలయాల ఉన్నతి కోసం ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇందులో భాగంగానే ఈ తరగతులు అన్నారు. ఎన్ఎంఎల్ అదనపు డైరెక్టర్ జనరల్ బీపీ శర్మ మాట్లాడుతూ.. దేశంలోని పబ్లిక్ లైబ్రరీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని చెప్పారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ హుస్సేన్, ప్రధాన గ్రంథాలయాధికారి సురేంద్రబాబు, వర్సిటీ మీడియా కో-ఆర్డినేటర్ పీసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ చేతులు

గూడూరు అర్బన్, మార్చి 19: మంగళగిరిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మే నెల 19నుంచి 26వ తేదీ వరకు చెయ్యి లేని దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ చేతులు అమర్చనున్నట్లు రోటరీక్లబ్ సభ్యుడు మయూరి శ్యామ్‌యాదవ్ మంగళవారం తెలిపారు. అవసరమైన దివ్యాంగులు 7207403150 హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

రెండు వర్గాల ఘర్షణ

కేసుల నమోదు

కోట, మార్చి 19: మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్త పాళెంలో పొలాల వద్ద సాగునీటి విషయమై రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు. కావలి పోలయ్యపై అదే గ్రామానికి చెందిన కోటేశ్వరరావు, శ్రీనివాసులు, వెంకటకృష్ణయ్య దాడి చేశారని ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో ఇరువురి కేసులు నమోదుచేసినట్లు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు.

అందని గంగ... ఎండుతున్న వరి

నీరివ్వలేమని చేతులెత్తేసిన అధికారులు ● గుండెలు బాదుకుంటున్న అన్నదాతలు


సిద్ధమ్మకండ్రిగ వద్ద ఎండుముఖం పట్టిన వరిపైరు

కోట, మార్చి 19: కోట మండలంలోని తెలుగుగంగ నీరు అందక వరి పంటలు ఎండిపోతున్నాయి. మండలంలో మెట్ట పంచాయతీలైన కేశవరం, మద్దాలి, చిట్టేడుతో పాటు డెల్టా పంచాయతీలైన అల్లంపాడు, పుచ్చలపల్లి, ఉత్తమ నెల్లూరు ప్రాంతాల్లో 4,500 ఎకరాల్లో రైతులు సాగు చేసిన వరి పైర్లు వెన్ను, పొట్టదశలో ఉన్నాయి. మరో రెండు తడులు నీరందిస్తే దిగుబడి చేతికందుతుంది. అయితే చెరువులు, గుంటలు ఎండిపోయాయి. ఇదే సమయంలో తెలుగుగంగ నీరివ్వలేమంటూ అధికారులు చేతులెత్తేయడంతో అన్నదాతలు గుండెలు బాదుకుంటున్నారు. రైతులు ఈ ఏడాది ముందుగానే వరినార్లు పోసుకున్నప్పటికీ గత ఏడాది చివర్లో సంభవించిన మిచౌంగ్ తుఫాన్ వల్ల నారు మడులన్నీ వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయి. అదును అయిపోయినప్పటికీ తిరిగి నారుమడులు పోసుకోవాలని, చివరిలో సాగునీరు తక్కువయితే కండలేరు నుంచి గంగను తెప్పించి పంటలు కాపాడుతామని అధికార పార్టీ నేతలు భరోసా ఇచ్చినట్లు రైతులు చెబుతున్నారు. ఆ నేతలను నమ్మి రైతులు పెద్ద జిలకర్ర, నెల్లూరు జిలకర్రను వరిసాగు చేశారు. పంట చివర దశలో చెరువుల్లో చుక్కనీరు లేకపోవడం తెలుగు గంగ అధికారులకు విజ్ఞప్తి చేశారు. అయితే నీరివ్వలేమంటూ అధికారులు స్పష్టం చేయడంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. పక్కనే ఉన్న చిట్టమూరు మండలంలోని మల్లాం ప్రాంతానికి గంగనీరు ఇస్తున్న అధికారులు కోట మండలంపై వివక్ష చూపుతున్నారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కండలేరు డ్యామ్‌లో 275 ఎంసీఎఫ్‌టీ డెడ్ స్టోరేజీలో నీళ్లు ఉన్నాయని, కేవలం 5వ బ్రాంచ్ కెనాల్ ద్వారా 150 క్యూసెక్కులు మాత్రమే కోట మండలానికి ఇవ్వాలన్న లక్ష్యంతో నీరు వదిలామని, అవి చిల్లకూరు మండల పరిధిలోకి సమీపం వరకే వచ్చాయని, దిగువభాగాన ఉన్న కోట మండలంలోని స్వర్ణముఖి, చల్లకాలువ మీదుగా గంగనీటిని పంపి పంటలను కాపాడాలనుకున్నప్పటికీ సరిపోలేదని అధికారులు చెబుతున్నారు. కోట మండలానికి తెలుగుగంగ నీటిని ఇవ్వలేమని ఆశాఖ ఈఈ శ్రీనివాసరావు తేల్చిచెప్పడంతో అన్నదాతలు గుండెలు బాదుకుంటున్నారు.

టీడీపీతోనే బలహీన వర్గాల అభ్యున్నతి: విజయశ్రీ


చిలమత్తూరులో ప్రచారం నిర్వహిస్తున్న విజయశ్రీ

నాయుడుపేట టౌన్, మార్చి 19: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమవుతుందని సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ అన్నరు. మండలంలోని చిలమత్తూరు గ్రామంలో మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ రాబోవు ఎన్నికల్లో టీడీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. విజయశ్రీ మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు లభించాలంటే టీడీపీకి పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీరామ్ ప్రసాద్, చెంచయ్య, సుబ్బరాయులు, జనార్ధన్‌రెడ్డి, చక్రపాణి, చంద్రశేఖర్‌రెడ్డి, బాబు, కిష్టయ్య, రాజేంద్ర, అవధానం సుధీర్, మధుసూదన్‌నాయుడు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న పాశం సంధ్యారాణి

గూడూరు, మార్చి 19: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. మంగళవారం స్థానిక కర్ణాలవీధిలో శంఖారావం, సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు అమాతం పెరిగిపోవడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ఇంటి పన్నులు, విద్యుత్, ఆర్టీసీ చార్జీలను వైసీపీ ప్రభుత్వం పెంచేసిందన్నారు. ప్రజారంజక పాలన అందించాలంటే చంద్రబాబునాయుడుకే సాధ్యమవుతుందన్నారు. రానున్న ఎన్నికలలో ఉమ్మడి ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, ప్రవీణ్, సుమన్, అనిల్, తూపిలి సురేంద్ర, శంకరయ్య, వెంకటరమణ, అమరేంద్ర, ప్రణీత్, తరుణ్, సాయిచరణ్, నరసింహులు నాయుడు, గాయం రమణయ్య, తాళ్ల సుబ్బమ్మ, రవీంద్రరెడ్డి, జనార్ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలి:జనసేన



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

గూడూరు అర్బన్, మార్చి 19: ఎన్నికల కమిషన్, రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకు వలంటీర్లు ఎన్నికల ప్రచారాలకు దూరంగా ఉండాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు ప్రచారంలో పాల్గొంటే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. 18ఏళ్లు నిండినవారు ఏప్రిల్ 15వ తేదీలోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇంద్రవర్ధన్, భాస్కర్, బాలసుబ్రమణ్యం, శివకుమార్, క్రాంతి, కార్తీక్, వేణు, రాము, అశోక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో తహసీల్దారు విచారణ


విద్యార్థులను విచారిస్తున్న తహసీల్దారు కల్యాణి

నాయుడుపేట, మార్చి 19: నాయుడుపేట ఎల్‌ఏసాగరంలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను తహసీల్దారు కళ్యాణి మంగళవారం సందర్శించారు. గురుకులంలోని సీనియర్ విద్యార్థులు జూనియర్ల పట్ల దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని సోమవారం తల్లిదండ్రులు ఆర్డీవో చంద్రమునికి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు తహసీల్దారు కల్యాణి మంగళవారం విచారణ చేపట్టారు. వసతి గదులు, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించగా పారిశుధ్య కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు లేవని, శానిటేషన్‌కు రావాల్సిన బిల్లులు కూడా రాలేదని తెలిపారు.

మోహన్‌బాబుకు టీడీపీ నేతల శుభాకాంక్షలు


మోహన్‌బాబుతో టీడీపీ నాయకులు

నాయుడుపేట, మార్చి 19: ప్రముఖ సినీనటుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ మోహన్‌బాబుకు నాయుడుపేటకు చెందిన టీడీపీ నాయకులు పనబాక గంగబాబు, న్యాయవాది పనబాక చిన్నగంగబాబులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తిరుపతి జిల్లాలోని విద్యానికేతన్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సినీహీరో మంచు మనోజ్‌కుమార్ ఉన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.78 కోట్లు

తిరుమల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.78 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.4.78 కోట్లు ఆదాయం లభించినట్టు మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 65,051 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,107 మంది తలనీలాలు సమర్పించారు.

గడ్డివామి దగ్ధం

కోట, మార్చి 19: మండల పరిధిలోని రాఘవాపురంలో మంగళవారం శ్రీరామ్ రమణయ్యకు చెందిన గడ్డివామి మంగళవారం అగ్నికి ఆహుతైంది. గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివామిపై సిగిరేట్ పీకలు వేయడంతో ఒక్కసారిగా మంటలు ఎగిశాయి. కోట నుంచి ఫైర్ ఇంజన్ వెళ్లి మంటలను ఆర్పివేసింది.

వీధిలో దుకాణాల నిర్మాణం

అడ్డుకున్న అధికారులు


వీధిలో దుకాణాల కోసం వేసిన పునాది

కోట, మార్చి 19: మండల పరిధిలోని చెందోడు పంచాయతీలో ఓ వ్యక్తి వీధిని ఆక్రమించి దుకాణాలు నిర్మించేందుకు ఉపక్రమించాడు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


తిన్నెలపూడి పోలింగ్ కేంద్రంలో ఎంపీడీవో, ఎస్‌ఐ

కోట, మార్చి 19: మండల పరిధిలోని వెంకన్నపాళెం, తిన్నెలపూడి, కొక్కుపాడు, కొత్తపట్నం గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎంపీడీవో శంకరయ్య, ఎస్‌ఐ నాగబాబు పరిశీలించారు. ఎన్నికల నిబంధనలపై ఓటర్లకు అవగాహన కల్పించారు.

అన్నదానం


వృద్ధులకు భోజనం అందజేస్తున్న కల్యాణ్‌రెడ్డి

పెళ్లకూరు, మార్చి 19: కేఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వేలూరు కల్యాణ్‌రెడ్డి, మోహన్ రూపారెడ్డి దంపతుల కుమారుడు కేతన్‌రెడ్డి మొదటి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు. అలాగే పేదలకు చీరలు, పంచెలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

రైల్వేగేటు మూసివేత


మూసివున్న రైల్వే గేటు

గూడూరు, మార్చి 19: గూడూరు ఒకటో, రెండో పట్టణాలకు రాకపోకలు సాగించే ప్రాంతంలో తిరుపతి మార్గంలో ఉన్న రైల్వే గేటును కారణంగా మూసివేశారు. ఈ గేటు వద్ద ట్రాక్ మరమ్మతులు, రోడ్డు అభివృద్ధి పనులను సోమవారం నుంచి చేపట్టారు. ఈనెల 23 వరకు పనులు కొనసాగుతాయని, అప్పటి వరకు ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగించాలని రైల్వే అధికారులు సూచించారు.

రవాణాశాఖ చెక్‌పోస్టు మూసివేతతో

ఆన్‌లైన్ సెంటర్లకు పండగ

తడ, మార్చి 19: రవాణాశాఖ చెక్‌పోస్టు మూతపడటంతో కామన్ సర్వీస్ సెంటర్ల(ఆన్‌లైన్)కు పండగలా మారింది. భీములవారిపాళెంలో రవాణాశాఖ చెక్‌పోస్టు గత శనివారం సాయంత్రం నుంచి మూసివేసిన విషయం తెలిసిందే. పర్మిట్లు వంటి సర్వీసులను ప్రభుత్వం ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చింది. అయినా కొంతమంది చెక్‌పోస్టు వద్దకు వచ్చి అక్కడ కార్యాలయంలో నగదు చెల్లించి సేవలను పొందేవారు. శనివారం సాయంత్రం నుంచి చెక్‌పోస్టు మూసివేయడంతో పాటు అప్పటికప్పుడు అక్కడే కామన్ సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేశారు. కొంతమంది మొబైల్ సర్వీస్ సెంటర్లను చెక్‌పోస్టు ఆవరణ వద్దే ఏర్పాటు చేసి వాహనదారులకు పర్మిట్లు, ఇతర సేవలను అందిస్తూ భారీగా నగదు వసూలు చేస్తున్నారు.

తమిళనాడు రేషన్ బియ్యం స్వాధీనం

తడ, మార్చి 19: అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం అక్రమంగా రేషన్ బియ్యం రవాణా అవుతున్నట్లు విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. దీంతో నిఘా పెట్టిన అధికారులు అక్కంపేట వద్ద లారీలో తరలించేందుకు సిద్ధంగా ఉన్న 583 బస్తాలు(21 టన్నుల) తమిళనాడు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని, బియ్యాన్ని సివిల్ సప్లయిస్ గోదాములో భద్రపరిచారు. లారీని, డ్రైవర్‌ను పోలీసులకు అప్పగించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్, సీఎస్ డీటీ ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

గూడూరు, మార్చి 19: ఆత్మహత్యాయత్నకు యత్నించిన యువకుడి మృతి చెందాడు. రూరల్ పోలీసుల కథనం మేరకు... మండలంలోని ఈదలపల్లి గ్రామానికి చెందిన సుబ్బయ్య(35) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో మనస్తాపానికి గురై సోమవారం వేకువజామున ఇంట్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. సుబ్బయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీలో పలువురి చేరిక


శ్రీనివాసులురెడ్డిని టీడీపీలోకి ఆహ్వానిస్తున్న నెలవల తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 19: వైసీపీకి చెందిన పలువురు టీడీపీలో చేరారు. మంగళవారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వైసీపీకి చెందిన నేత ఉగ్గుముడి సర్పంచు తాటిపర్తి శ్రీనివాసుల రెడ్డి, మాజీ సర్పంచు తాటిపర్తి రఘురామ రెడ్డి, నాగేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ నెలబోయిన రాజసులోచనమ్మ, దొరైబాబు టీడీపీ తీర్థంపుచ్చుకొన్నారు. వారికి మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, నాయకులు కొక్కు శంకరయ్య, గాడి నారాయణ రెడ్డి, శిరసనం బేటి విజయభాస్కర్ రెడ్డి, బొమ్మన్ పళణి, మాధవనాయుడు, బుజ్జిబాబు, రఫీ, పూడి శెల్వం, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


నదగు అందజేస్తున్న టీడీపీ నేతలు

గూడూరు అర్బన్, మార్చి 19: స్థానిక కోతరూం వీధికి చెందిన టీడీపీ కార్యకర్త శ్రీహరికి ఆ పార్టీ నాయకులు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. కొంత కాలంగా శ్రీహరి అనారోగ్యంతో బాధపడుతుండడంతో వైద్యఖర్చుల నిమిత్తం మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ దాతృత్వంతో రూ.10వేలు అందించడం జరిగిందని టీడీపీ నాయకులు చెప్పారు. కార్యక్రమంలో పిశ్లెళ్ల శ్రీనివాసులు, రాంబాబు, పరిమల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నోడల్ అధికారులు సమర్థంగా పనిచేయాలి: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 19: 'నోడల్ అధికారులు జిల్లా ఎన్నికల అధికారికి కళ్లు, చెవులు వంటివారు. అందువల్ల సమర్థంగా పనిచేయాలి'అని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. పీపీటీ తయారీతో సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. విధులను అంకితభావంతో నిర్వర్తించాలన్నారు. డీఆర్వో పెంచలకిషోర్, ఎలక్షన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అలిపిరి కాలినడక మార్గంలో జెర్రిపోతు

తిరుమల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలినడకమార్గంలో మంగళవారం సుమారు ఆరడుగుల పొడవైన జెర్రిపోతు పాము పట్టుబడింది. దివ్యారామానికి సమీపంలోని నేపాలి సెక్యూరిటీ షెడ్‌లోకి ఈ పాము ప్రవేశించింది. గుర్తించిన సిబ్బంది భయంతో బయటకి పరుగులు తీశారు. వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన అక్కడికి చేరుకుని ఆ పామును చాకచక్యంగా పట్టుకున్నాడు. పట్టుబడిన పామును దట్టమైన అడవిలో విడిచిపెట్టాడు.